
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 7 సెప్టెంబరు 2025

బైబై.. వెళ్లొస్తాం..



వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా 11వ రోజైన శనివారం తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల వినాయక విగ్రహాలను వినాయకసాగర్‌లో నిమజ్జనం చేశారు. ఇందులో భాగంగా తన వాహనమైన మూషికంపై ఊరేగుతూ వచ్చిన వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ఆలయాల రూటులో 'స్త్రీశక్తి' ఫుల్

● ట్రిప్పుల పెంపునకు ఆర్టీసీ ప్రతిపాదన

స్త్రీశక్తి పథకానికి విశేష ఆదరణ లభిస్తోంది. ఆర్టీసీ రోజువారి గణాంకాల ద్వారా ఈ విషయం స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. జిల్లాలో శ్రీకాళహస్తి, తిరుచానూరు, అప్పలాయగుంట, గుడిమల్లం, కాణిపాకం పుణ్యక్షేత్రాల ప్రభావం స్త్రీశక్తి పథకంపై కనిపిస్తోంది. ఆయా ఆలయాల మార్గంలో పెరగిన రద్దీయే ఇందుకు తార్కాణం. మరోపక్క రోడ్లు అనుకూలంగా ఉండడంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా బస్సులు సమయపాలన పాటించగలుగుతున్నాయి. దీంతో ప్రయాణానికి మహిళలు పోటీపడుతున్నారు.ఫలితంగా బడులకు, కూలి పనులకు కొందరు సమయానికి చేరలేకపోతున్నారు. ఉదయం 7నుంచి 10గంటల మధ్య, సాయంత్రం 3.30నుంచి రాత్రి 8గంటల మధ్య ఈ ప్రభావంతో రద్దీ ఏర్పడుతోంది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి, సత్యవేడు, నగరి, కాణిపాకం, పుత్తూరు-చిత్తూరు నడిచే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల ట్రిప్పులు పెంపునకు అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. ఏడు డిపోలకు మూడు బస్సులు చొప్పున అదనంగా ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను కోరారు.

– తిరుపతి(ఆర్టీసీ), ఆంధ్రజ్యోతి

తల్లికి భారమై..

● ఆరునెలల ఆడబిడ్డను కాలువలో పడేసిన వైనం
● పేదరిక నేపథ్యంలో హతమార్చినట్లు తల్లి వెల్లడి

మృత్యు ఒడికి చిన్నారి



రమ్య తల్లి చందన



హత్యకు గురైన రమ్య

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పేదరికం అన్ని దారులనూ మూసేస్తుందంటారు. కష్టాలు మనిషిని మార్చేస్తుందంటారు. ఈ పరిస్థితుల్లోనే ఓ తల్లి పేగుబంధం మరిచిపోయింది. తాగుబోతు భర్త, పేదరిక పరీక్షలతో వేగలేక ఆరు నెలల పసికందును కాలవలో పడేసి చంపేసింది. అలిపిరి సీఐ రాంకిషోర్ కథనం మేరకు...తిరుపతి సమీపంలోని కొరమేనుగుంటలో భూపతి, చందన దంపతులు ఉంటున్నారు. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు. వీరికి ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె దివ్యకు ఐదేళ్లలు, రెండవ కుమార్తె కిత్యకు నాలుగేళ్లు. మూడోసారి మగబిడ్డ పుడతాడని భావించారు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం మూడో కుమార్తె రమ్య పుట్టింది. దీనికితోడు భర్త తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకునేవాడు కాదు. కుటుంబ పోషణ భారమంతా చందనపై పడిం ది. హాస్టల్లో పనిచేసే అత్తకు వచ్చే ఆరేడు వేల రూపాయలు కూడా ఎటూ చాలడం లేదు. ఈ నేపథ్యంలో మూడో సంతానం రమ్యను ఎలాగైనా వదిలించుకోవాలని చందన నిర్ణయించుకుంది. శనివారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లే సమయంలో పసిబిడ్డను మురికి కాలువలో పడేసి చంపేసింది. తర్వాత బిడ్డ కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్పీ హర్షవర్ధనరాజు వెంటనే డీఎస్పీ భక్తవత్సలం, సీఐ రాంకిషోర్‌ను వెంట పెట్టుకుని ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. ఎక్కడా ఆచూకీ దొరకలేదు. చందన, భూపతిలను అదుపులోకి తీసుకుని విచారించారు. బిడ్డను తీసుకుని బహిర్భూమికి వెళ్తుండగా చంకలోని చిన్నారి రమ్య మురికి కాలువలోకి జారి పడిపోయిందని చందన చెప్పింది. ఆమె చెప్పిన చోట డ్రోన్ల సహాయంతో గాలించినా దొరకలేదు. భార్యాభర్తలు భిన్న కోణాల్లో చెబుతుండటంతో పోలీసులు అనుమానించారు. తమదైన శైలిలో వారిని విచారించారు.దీంతో చంద న నేరం అంగీకరించింది. పేదరికంతో కుటుంబ పోషణ కష్టంగా మారి మనసు కఠినం చేసుకుని తానే ఆరు నెలల రమ్యను కాలువలో పడేసి చంపేశానని చెప్పింది. పోలీసులు రమ్య మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీశారు. నిందితురాలు చందనను అరెస్ట్ చేసి, హత్య కేసు నమోదు చేశారు.

నేడు ముక్కంటి ఆలయంలో
గ్రహణ కాలాభిషేకం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాత్రి గ్రహణ కాలాభిషేకం నిర్వహించనున్నారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి నవగ్రహాలను కవచంగా ధరించి ఉంటారు.అందుకే ఈ క్షేత్రం లో గ్రహణ కాల సమయంలోనూ ఆలయాన్ని తెరచి ఉంచి, విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. ఆదివారం రాత్రి రాహుగ్రస్త చంద్రగ్రహణం స్పర్శాకాలం 9.50గంటలకు ప్రారంభమై అర్ధరాత్రిపైన 1.31గంటలకు మోక్షకాలంతో గ్రహణం విడుపుగా ఆగమ పండితులు నిర్ణయించారు. ఈ మేరకు మధ్యకాలం 11.41 గంటల సమయంలో ఆలయంలోని మూలమూర్తులకు అభిషేకం నిర్వహించనున్నారు. అర్ధరాత్రి వేళ కావడంతో భక్తులకు అనుమతి కల్పించడంలేదని అధికారులు ప్రకటించారు. కేవలం అర్చకులు మాత్రమే ఏకాంతంగా గ్రహణ కాల అభిషేకం నిర్వహించనున్నారు.

పోలేరమ్మ ఆలయ చైర్మన్‌గా మురళీకృష్ణ



వెంకటగిరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ దేవస్థానం చైర్మన్‌గా గొల్లగుంట మురళీకృష్ణను నియమిస్తూ శనివారం రాష్ట్ర దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌తో పాటు ఆలయ పాలకవర్గ సభ్యులుగా తాండవ చంద్రశేఖర్, పుట్టా శివప్రసాద్, టీవీ కృష్ణ, జే.యామిని, పులికొల్లు జగదీశ్వరి, కలపాటి నాగమణి, అనిల్ రామారావు, సి.తిరుపతిరావు, మదనపల్లి సావిత్రమ్మ, సత్యసాయి కిరణ్‌మయి, తిండివనం ప్రసాద్‌లను నియమించింది. చైర్మన్ మురళీకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో చైర్మన్ పదవి ఇచ్చినందుకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో చైర్మన్‌గా పనిచేసిన అనుభవంతో పోలేరమ్మ జాతరను విజయవంతం నిర్వహిస్తామని చెప్పారు.

ఆక్రమణ చెర నుంచి
ఆలయ భూములకు విముక్తి

● 130 ఎకరాల రికార్డుల అప్పగింత
● భూముల విలువ రూ.25 కోట్లు



తలకోన ఈవో రవీంద్రరాజుకు భూ హక్కుల పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్ పరమేశ్వర స్వామి

ఎర్రావారిపాలెం,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి):వివిధ ఆలయాలకు చెందిన రూ25 కోట్ల విలువ చేసే భూములకు విముక్తి కలిగింది. వివరాలిలా.. మండలంలో పది రెవెన్యూ గ్రామాల పరిధిలో గతంలో 29 ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు, నిర్వహణకు పలువురు దాతలు భూములు విరాళంగా అందజేశారు. ఇవి రెవెన్యూ రికార్డుల్లో ఆలయాల పేరిట నమోదై ఉన్నాయి. కాలక్రమేణా కొన్ని ఆలయాల భూములు ఆక్రమణకు గురయ్యాయి. వీటని సాగు చేసుకుంటూ తమ భూమిగానే ఆక్రమణదారులు చెప్పుకొస్తున్నారు. తొలినాళ్లలో కొందరు పంటలో సగం ఆదాయం ఆలయాలకు అందజేశారు. వారి తరం కనుమరుగవ్వడంతో తర్వాత వారసులు ఇవ్వడం మానుకున్నారు. పైగా సాగులో ఉన్న భూములకు పట్టాలు పొందేందుకు ప్రయత్నించారు. తలకోన ఆలయ ఈవో రవీంద్రరాజు ఇటీవల ఈ విషయంపై దృష్టి సారించారు. తహసీల్దార్ పరమేశ్వరస్వామితో సంప్రదించారు. భూముల వివరాలను అందజేశారు. భూములపై తిరిగి ఆలయాలకు యాజమాన్య హక్కులు కల్పించేలా మ్యుటేషన్ కోరుతూ దరఖాస్తు చేశారు. తహసీల్దార్ రికార్డులను లోతుగా పరిశీలించి 130 ఎకరాల భూములకు మ్యుటేషన్ ఆమోదించారు. ప్రస్తుతం ఈ భూముల మార్కెట్ విలువ రూ25 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. శనివారం భూముల పత్రాలను తహసీల్దార్ తలకోన ఈవోకు అందజేశారు.



గత ఏడాది వరదలకు నెర్రికాలువకు పడిన గండి



అధికారులు మరోచోట కొట్టిన గండి

నెర్రికాలువ పనుల్లో
చేతివాటం

● గండిపడిన చోట కాకుండా మరో వైపు కాంక్రీట్ వాల్ నిర్మాణం
● చర్చికి అనుకూలంగా పనులు
● ఇరిగేషన్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



చర్చివైపు నిర్మిస్తున్న కాంక్రీట్ వాల్

సూళ్లూరుపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే నెర్రికాలువ పనుల్లో ఇరిగేషన్ అధికారులు చేతివాటం చూపుతున్నారు. గత ఏడాది నవంబరు, డిసెంబరు మాసాల్లో వచ్చిన వరదలకు జీఎన్‌టీ రోడ్డు పక్కనే ఉన్న లూథరన్ చర్చి వెనకాల నెర్రికాలువకు భారీ గండిపడింది. దీంతో నీరంతా పక్కనే ఉన్న కాళంగి నదిలోకి వెళ్లింది. అప్పటి నుంచి నెర్రికాలువలో సాగునీటి పారుదల లేక సూళ్లూరు, పల్లిపాలెం, గోపాల్‌రెడ్డిపాలెం, పాములమట్టి, కారిజాత, వాటంబేడు, గొల్లల మొలువు గ్రామాల రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో నెర్రికాలువ గండిని పూడ్చి కట్టలు కోతకు గురికాకుండా రూ.39 లక్షలతో కాంక్రీట్ వాల్ నిర్మాణం చేపట్టేందుకు ఇరిగేషన్ అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను సైతం ప్రారంభించారు. అయితే పడిన గండిని పూడ్చకుండా ఇరిగేషన్ అధికారులు మరోచోట గండి కొట్టి కాంక్రీట్ వాల్ నిర్మాణం చేపట్టారు. దీన్ని పరిశీలించిన సమీప గ్రామ రైతులు ఇరిగేషన్ అధికారులను నిలదీశారు. అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సైతం ఇరిగేషన్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చివైపు కాంక్రీట్ వాల్ నిర్మాణం ఆపేసి, కోతకు గురయ్యే వైపు నిర్మించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే చెప్పినా పట్టించుకోని అధికారులు

ఎఫ్‌డీఆర్ నిధులతో నిర్మిస్తున్న కాంక్రీట్ వాల్‌ను ఇటీవల ఎమ్మెల్యే పరిశీలించారు. చర్చివైపు కాంక్రీట్ వాల్ నిర్మాణం ఆపేసి, గండిపడిన చోట వెంటనే పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అయినా చర్చివైపు కాంక్రీట్ వాల్ పనులు జరుగుతూనే ఉన్నాయి. గండిపడిన చోట కాకుండా చర్చి భవనానికి ఉపయోగపడేలా కాంక్రీట్ వాల్ నిర్మాణం చేపట్టడంలో మతలబు ఏమిటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జూలైలోనే గంగనీరు విడుదల చేసినా గండి పూడ్చకపోవడంతో మావిళ్లపాడు వద్ద నెర్రికాలువ గేట్లు తీయలేదు. వ్యవసాయ పనుల సీజన్ ప్రారంభమైనా చెరువులకు చుక్కనీరు చేరకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అధికారుల తీరుతో సాగునీరందక నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రానైట్ లారీ, ఆర్టీసీ బస్సు ఢీ

● 30 మందికి గాయాలు

చంద్రగిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ లోడ్డుతో వెళుతున్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో 30 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలోని అగరాల వద్ద శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. శ్రీకాళహస్తి డిపోకు చెందిన అద్దె బస్సు శుక్రవారం రాత్రి బెంగళూరు నుంచి శ్రీకాళహస్తికి వస్తోంది. తెల్లవారుజామున అగరాల వద్ద ముందు వెళుతున్న గ్రానైట్ లారీని ఢీకొంది. బస్సులో ప్రయాణిస్తున్న 30 మంది గాయపడ్డారు. ఇందులో బస్సు కండక్టర్ రత్నంతో సహా 10మందికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు తెలిపారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌ల ద్వారా చంద్రగిరి ఏరియా, తిరుపతి రుయా ఆస్పత్రులకు తరలించారు. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బస్సు కొంత నిదానంగా రావడంతోనే ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.







లారీని ఢీకొన్న బస్సు - చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ప్రతిష్టాత్మకంగా మహిళా సాధికార సదస్సు

– ఏర్పాట్లను పరిశీలించిన అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ –

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా ఈనెల 14, 15 తేదీల్లో జాతీయ మహిళా సాధికార సదస్సును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ అన్నారు. సదస్సు జరగనున్న రాహుల్ కన్వెన్షన్ సెంటర్, చంద్రగిరి కోటను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. అంతకు ముందు జిల్లా అధికారులతో సదస్సు ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సదస్సుకు దేశవ్యాప్తంగా ఉన్న మహిళా ప్రజాప్రతినిధులు హాజరై రెండు రోజులపాటు మహిళల సమస్యలపై సుదీర్ఘంగా చర్చిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తున్నందున ప్రతిష్టాత్మకంగా తీసుకుని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ సదస్సుకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, మంత్రులు వస్తుండటంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 14వ తేదీ రాత్రి సదస్సుకు విచ్చేస్తున్న ప్రజాప్రతినిధులు చంద్రగిరి కోటను సందర్శించి, లైటింగ్ షోను వీక్షించి, అక్కడే డిన్నర్ చేస్తారని తెలిపారు. ఎవరికి కేటాయించిన విధులు వారు నిర్వహించి సదస్సును విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఏఎస్పీ రవి మనోహరాచారి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి సుశీలాదేవి పాల్గొన్నారు.



రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్, కలెక్టర్ వెంకటేశ్వర్

మన మిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



యాప్ సేవల గురించి వివరిస్తున్న సిబ్బంది

భాకరాపేట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మన మిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వాట్సప్ ద్వారా అందించే సేవల వివరాలను తెలియజేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సర్టిఫికెట్లు, ఇతర సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా సులభంగా పొందేలా అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. సమయం ఆదా అవుతుందన్నారు. వాట్సప్ సేవలు పొందే విధానం, ఉపయోగాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, కార్యదర్శి రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రదేశాల పరిశీలన



పార్కింగ్ ప్రదేశాలను పరిశీలిస్తున్న అధికారులు

తిరుమల, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ ప్రాంతాల వినియోగంపై టీటీడీ, ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెట్టారు. ఈక్రమంలోనే వారు శనివారం పలు ప్రదేశాలను సందర్శించారు. సుమారు 5 వేల వాహనాలు పట్టేలా పార్కింగ్ ప్రదేశాలను ఇప్పటికే సిద్ధం చేశారు. వీటి వినియోగంపై అధికారులు శనివారం పరిశీలించి లైటింగ్, బ్యారికేడింగ్, పార్కింగ్ లైన్స్, సైన్‌బోర్డులు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాల కల్పనపై చర్చించారు. తనిఖీల్లో విజిలెన్స్ వీజీవో సురేంద్ర, ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువులకు సన్మానం



పాకాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని పాకాల ప్లాటినం లయన్స్‌క్లబ్, దామలచెరువు లయన్స్‌క్లబ్ సంయుక్తంగా మండలంలోని 14 మంది ఉపాధ్యాయులను శనివారం సన్మానించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెడ్డిరామరాజు, అధ్యాపకులు డాక్టర్ వి.మాశిలామణి, పి.హరినాథ్ ఆచారి, ఉపాధ్యాయులు ఎం. జయచంద్ర, ఎం.రోహిణి కుమారి, షబ్బీర్, వెంకటేశ్వరులు, డి.సుబ్బద్ర, బి.రామమూర్తి, పి.లక్ష్మీదేవి, పి.చిన్నస్వామి, యువరాజు, షమీనా, రిటైర్డ్ టీచర్ వి.చెంగ్రాయనాయుడులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షులు తులసీరామన్, రెడ్డిబాషా, ప్రతినిధులు జి.గురుస్వామినాయుడు, జయరామనాయుడు, దామోదరనాయుడు, కుప్పుస్వామినాయుడు, కృష్ణమూర్తినాయుడు, రామయ్య, ఆర్వీ ప్రసాద్, నాగూర్ బాషా, కెఎస్. మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనం



పాకాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాకాల సంతగేటు యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి గణేష నవరాత్రుల పూజలు నిర్వహించి శనివారం నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా మధ్యాహ్నం అన్నదానం చేశారు. ప్రత్యేక వాహనంలో వినాయక విగ్రహాన్ని పుష్పాలతో అలంకరించి కోలాహలంగా ఊరేగించారు. నేండ్రగుంట చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగ నిర్వహించిన లడ్డూ వేలంలో పచ్చిపాలపల్లె పద్మనాభం రూ.24,100, గోల్డ్ కాయిన్ మునిరత్నం రూ.14,000, వెండికాయిన్ వెంకటేష్ రూ.3,200లకు పాడుకున్నారు. న్యూకాలనీలోని వినాయక విగ్రహాన్ని కూడా నిమజ్జనం చేశారు. దామలచెరువ హైస్కూల్ గేట్‌లో నిమజ్జన వేడక నిర్వహించారు. లడ్డూలను వేలం వేశారు. మన్యం లోకేష్ దొర రూ.16వేలు, బోర్‌వెల్ సూర్య రూ.17వేలకు పాడుకున్నారు.

జీవన ఎరువులతో అధిక దిగుబడి సాధ్యం



అవగాహన కల్పిస్తున్న ఏవో హరితకుమారి

పాకాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి జీవన ఎరువులను వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి హరిత కుమారి సూచించారు. దామలచెరువులో శనివారం జీవన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. జీవన ఎరువులతో భూములు సారవంతమై నాణ్యమైన అధిక దిగుబడి పొందవచ్చన్నారు. తక్కువ వ్యయంతో సాగుచేసుకోవచ్చన్నారు. 40 కేజీల బస్తా యూరియా బదులు అరలీటరు నానోయూరియా పిచికారి చేసుకోవచ్చన్నారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని నాణ్యమైన అధిక దిగుబడులు పొందాలని సూచించారు.

కిశోర బాలికలకు అవగాహన

రామచంద్రాపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల ద్వారా కిశోర బాలికలకు అందించే పథకాలపై అవగాహన ఉండాలని నెత్తకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తులసీకుమారి అన్నారు. శనివారం మిషన్‌శక్తి సంకల్ప కార్యక్రమాన్ని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేవతి పర్యవేక్షణలో నిర్వహించారు. అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు రేవతి మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగ పరిశుభ్రతను పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించాక ఉత్సవర్లను విశేషంగా అలంకరించారు. బంగారు తిరుచ్చిపై అధిష్టింపజేసి మాడ వీధుల్లో ఊరేగించారు. ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగ్రాయులు, ఇన్‌స్పెక్టర్లు , అర్చకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలకు సత్కారం



చంద్రగిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండంలో జిల్లా స్థాయిలో అవార్డులు పొందిన వారిని శనివారం సత్కకరించారు. జిల్లా స్థాయిలో ఎంఈవో భాస్కర్‌బాబు, ఉపాధ్యాయులు రామిరెడ్డి, వెంకటనాగులు, మురుగయ్య, శైలజ, మండల స్థాయిలో ఉపాధ్యాయుల నాదముని, నరసింహారెడ్డి, .సుమతి, అనసూయ, లక్ష్మీనారాయణ, మంజుల, చంద్రకళ, శ్రీ.లక్ష్మీ, సుజనమ్మ, హరిప్రసాద్, .పావని, జయమ్మలు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిని సహ ఉపాధ్యాయులు సన్మానించారు. ముఖ్య అతిధులుగా ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబులు హాజరయ్యారు.

వారపు సంతలో హెచ్‌ఐవీ వ్యాధిపై అవగాహన

ఎర్రావారిపాలెం, సెప్టెంబరు6 (ఆంధజ్యోతి): మండల కేంద్రం తలకోన రోడ్డు సమీపాన వారపు సంతలో శనివారం కోర్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వాహించారు. వ్యాధి సంక్రమణ, జాగ్రత్తలపై చైతన్య పరచారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతి నిధులుతులసి, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి

83 గ్రాముల బంగారు ఆభరణాల చోరీ

పాకాల. సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లె పంచాయతీ మేడసాని ఇండ్లు గ్రామంలో ఎం.లక్ష్మయ్యనాయుడు ఇంట్లో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు 83 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఈనెల 3న లక్ష్మయ్యనాయుడు ఇంటికి తాళాలు వేసుకొని కుటుంబంతో బంధువుల ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చారు. ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉండడం గమనించారు. వెనుక బాత్‌రూమ్ కిటికి నుంచి దొంగలు ప్రవేశించి తలుపు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించినట్లు గుర్తించారు. సూట్‌కేసులోని రూ.15వేల నగదు, 83 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

మాస్టారి గురుభక్తి



వీరయ్య పురస్కారాన్ని అందజేస్తున్న నాగరాజు

ఎర్రావారిపాలెం, సెప్టెంబరు 6 ఆంధ్రజ్యోతి): విద్యాబుద్దులు నేర్పిన గురువుకు తాను పొందిన జిల్లా స్థాయి పురస్కారం అంకితమిచ్చారో ఉపాధ్యాయుడు. నెరబైలులోని మోడల్ ప్రైమరీ స్కూల్ టీచర్ బసవరాజు నాగరాజు ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ పురస్కారం రావడానికి తనకు చిన్నపుడు పాఠాలు చెప్పి తీర్చిదిద్దిన మాస్టారు ముండ్లపాటి వీరయ్య(87) అని ఆయన విశ్వసించారు. ఈక్రమంలోనే శనివారం నెరబైలులో ఉంటున్న 87ఏళ్ల మాస్టారుకు ఇంటికి వెళ్లి తనకు వచ్చిన అవార్డును అంకితమిచ్చారు. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య



సిద్దయ్య మృతదేహం

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెం బరు 6 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తట్టుకోలేక దళితుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు అందించిన వివరాలు... మండలంలోని వీఎస్‌పురం దళితవాడకు చెందిన దేవత సిద్దయ్య(54) శ్రీకాళహస్తి సమీపంలోని కోకా-కోలా కంపెనీలో పని చేస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం సుమారు రూ. 5లక్షల వరకు అప్పు చేశారు. తీర్చే దారి కనబడక శనివారం ఉదయం సమీపంలో పొలాల దగ్గర పురుగు మందు తాగాడు. అటుగా వెళ్తున్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు సిద్దయ్యను శ్రీకాళహస్తిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు.

గుండెపోటుతో ఒకరి మృతి ఆగిన కుంభాభిషేకం

ఏర్పేడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రామాలయం కుంభాభిషేకం హోమంలో కూర్చున్న వ్యక్తి ఉన్నట్టుండి కుప్పకూలి మృతి చెందడంతో కార్యక్రమం ఆగింది. మండలంలోని చింతలపాళెంలో రూ.20లక్షలతో రామ మందిరాన్ని నిర్మించారు. వేద పండితుల సూచనలతో శనివారం ఆలయ కుంభాభిషేకాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆలయంలో జరుగుతున్న హోమంలో కూర్చుని ఉన్న అదే గ్రామానికి చెందిన శ్రీధర్(45) గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో కుంభాభిషేకం నిలిచిపోయింది. శ్రీధర్ తిరుపతి నుంచి తిరుమలకు కారు తోలుకుని జీవనం సాగిస్తుంటాడు. ఇతనికి భార్య, ఇద్దరు చిన్నపిల్లలున్నారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముక్కంటీశుడి ఆలయంలో కొలువై ఉన్న శనీశ్వరస్వామికి శనివారాన్ని పురస్కరించు కుని తైలాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. స్వామిఅమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం శనీశ్వరస్వామికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ జలం, కలశ జలాలతో అభిషేకించారు. పుష్పాలతో విశేషంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6 (సెప్టెంబరు): శ్రీకాళహస్తీశ్వరాలయంలో పవిత్రోత్సవాలు నాల్గో రోజు శనివారం ఆగమోక్తంగా జరిగాయి. నిత్య పూజల్లో జరిగే దోషాలను నివారించేందుకు యేటా ఈ పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆలయంలోని యాగశాల వద్ద శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తులకు పలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి పూజలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ఆది వారం అన్ని అభిషేకాలను రద్దు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనం రాత్రి 9 గంటల వరకు ఉంటుందని ఈవో బాపిరెడ్డి తెలిపారు.

అవిలాలలో అవస్థలమయం



ఎటు చూసినా గుంతల రహదారులే



రోడ్డు పక్కన నిర్మాణ వ్యర్థాలు

తిరుపతి రూరల్, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): అవిలాలలోని పలురోడ్లు గుంతలమయంగా తయారయ్యాయి. ప్రధానవీధిలో (గంగమ్మగుడి) యూడీఎస్ కోసం తీసిన గోతులు సక్రమంగా పూడ్చలేదు. ఇవి ప్రమాదకరంగా మారాయి. ఇళ్లముందు గోతుల వల్ల రాకపోకల సమయంలో వాహనదారులు, పాదాచారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి గుంతల్లో వర్షపునీరు నిల్వచేరి మరింత పరీక్ష పెడుతోంది. ఈనీటిలో దోమలు వృద్ధి చెంది అనారోగ్యాలబారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.సుబ్బయ్యకాలనీలోని రోడ్లు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షం వచ్చినా బురదమయంగా తయారై ఇబ్బంది పెడుతున్నాయి. పాతపంచాయతీ కార్యాలయం నుంచి జాతీయ రహదారి మార్గంలో పక్కన ఎక్కడపడితే అక్కడ నిర్మాణ వ్యర్థాలు పడేశారు. ఇదే మార్గంలోని ఖాళీస్థలాలో డ్రైనేజీ, వర్షపునీరు నిల్వచేరుతోంది. ఈనీటిలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పలుచోట్ల డ్రైనేజీకాలువ నుంచి మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీకి ఆదాయ వనరులున్నా మౌలికవసతులపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం అనుమతిస్తే డివిడెండ్ చెల్లిస్తాం

● టౌన్ బ్యాంక్ పాలక మండలి వైస్ చైర్మన్

తిరుపతి,(ఆటోనగర్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ వాటాదారులకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే డివిడెండ్ చెల్లిస్తామని ఆ బ్యాంక్ పాలక మండలి వైస్ చైర్మన్ వై.వాసుదేవ యాదవ్ వెల్లడించారు. శనివారం తిరుపతి కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో జరిగిన 107వ వార్షిక మహాజన సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు డివిడెండ్ ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాము బ్యాంక్ పాలక మండలి సభ్యులుగా బాధ్యతలు తీసుకున్న సమయంలో మొండి బకాయిలు 22శాతం ఉండేవన్నారు. రూ.20 నుంచి రూ.30 కోట్ల మొండి బకాయిలు వసూలు చేసి 22శాతం నుంచి 5శాతానికి తగ్గించామని ఆయన వివరించారు. న్యాయపరంగా వాటాదారులకు డివిడెండ్ చెల్లించడానికి ప్రయత్నిస్తున్నామని ఆయన హామీ ఇచ్చారు. మహాజన సభ నిర్వహణకు కోరం మేరకు 10వేల మంది హాజరు కావలసి ఉందన్నారు. శనివారం నిర్వహించిన సభకు కోరం మేరకు వాటాదారులు హాజరు కాకపోవడంతో సభను ఎండీ శివకుమార్‌రెడ్డి వాయిదా వేశారు. పాలక మండలి డైరెక్టర్లు ఎ.సురేష్‌కుమార్‌రెడ్డి, సి.నాగిరెడ్డి, జి.వెంకటేష్ రాయల్, ఆర్.బ్రహ్మానందరెడ్డి, ఎం.చంద్రయ్య, కె.అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రెడాయ్ ప్రాపర్టీ షోను సందర్శించండి

● ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు



క్రెడాయ్ ప్రాపర్టీషోను సందర్శించిన ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

తిరుపతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న క్రెడాయ్ ప్రాపర్టీ షోను శనివారం తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈసందర్భంగా ఛాంబర్ అధ్యక్షుడు మోహన్‌కుమార్ రాజు మాట్లాడుతూ స్వంత ఇంటి కలను సాకారం చేయడం కోసం క్రెడాయ్ నడుంకట్టి బిల్డర్స్‌ను, ఫైనాన్షియర్స్‌ను, గృహ నిర్మాణానికి కావలసిన వస్తు సామగ్రి డీలర్లను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం అభినందనీయమన్నారు. ఆదివారం ఆఖరిరోజు ప్రదర్శనను ప్రజలు వినియోగించుకోగలరని కోరారు. ప్రాపర్టీ షోను సందర్శించినవారిలో కార్యదర్శి వాసుదేవన్, ఉపాధ్యక్షులు మల్లిశెట్టి రవి, సత్యనారాయణ, బాలాజీ, కిరణ్, సహాయ కార్యదర్శులు చక్రపాణి, వాకా ప్రసాద్ తదితరులు ఉన్నారు.


మంత్రి సత్యకుమార్‌కు ఘన స్వాగతం



మంత్రి సత్యకుమార్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడికి తిరుపతిలో స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. నాగోతు రమేష్ నాయుడు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా రాజంపేటలో ఏర్పాటు చేసిన అభినందన సభకు హాజరయ్యేందుకుగాను ఆయన మంత్రి సత్యకుమార్‌తో కలిసి శనివారం వేకువజామున తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలులో తిరుపతికి వచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ తదితరులు తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఇరువురికి స్వాగతం పలికి గజమాలతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు అన్నారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎ1 మస్తాన్, పార్వతి, నాగోతు హరి నాయుడు, ఓలేటి చంద్రబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ తిరుపతి అసెంబ్లీ కన్వీనర్ అజయ్‌కుమార్, మాజీ ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, తలారి నాదమునిరెడ్డి తదితరులు మంత్రిని కలిసి దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం మంత్రి సత్యకుమార్, నాగోతు రమేష్ నాయుడు రోడ్డుమార్గంలో రాజంపేటకు బయలుదేరి వెళ్లారు.

విద్యార్థి దశ నుంచే ప్రజాసంబంధాలు పెంచుకోవాలి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్ఎస్ఐ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుంచే ప్రజాసంబంధాలు పెంపొందించుకోవాలని ఎంఆర్‌పల్లి జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్.హరినాథరెడ్డి అన్నారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంఆర్‌పల్లి జడ్పీ ఉన్నతపాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు - విద్యార్థి సంబంధాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. తిరుపతికి చెందిన ఎడ్యుకేషనల్ అడ్వైజర్ కె.వి.ఎస్.ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల దశ నుంచే నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా ఆదర్శనీయమైన సమాజాన్ని సృష్టించే అవకాశం ఉంటుందన్నారు. ఎస్వీయూ తెలుగు విభాగం పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ సమాజాన్ని ఉన్నతస్థితికి తీసుకెళ్లేది ఉపాధ్యాయ వృత్తి మాత్రమే అన్నారు. బయాలజీ ఉపాధ్యాయులు సి.మునికృష్ణ, కె.ఉమాదేవి, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు ఎం.నీరజలకు జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు. పీఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ చైర్మన్ డాక్టర్.జి.ఎస్.ప్రసాద్, సెక్రటరి దుద్యాల చంద్రమోహన్, కోశాధికారి కె.మధుసూదన్, కె.శ్రీనివాసరావు, స్వరాజ్యక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నానో, జీవన ఎరువులతో నేలకు రక్షణ

తిరుపతిరూరల్, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): సాగులో నానో, జీవన, సేంద్రీయ, పచ్చిరొట్ట ఎరువులను వినియోగించడం వల్ల నేలకు రక్షణతోపాటు భూసారాన్ని పెంచుకోవచ్చని రూరల్ మండల వ్యవసాయాధికారి సుబ్బారావు సూచించారు. తనపల్లె రైతుసేవాకేంద్రంలో శనివారం భూమాత రక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎరువుల వాడకాన్ని తగ్గించడం, నానో యూరియా, డీఏపీ, జీవన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన నిర్వహించారు. భూలక్ష్మి ప్రొడ్యూసర్స్ సంస్థ సీఈవో గంగాధరం, రైతులు, సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్‌కు తుడా ఛైర్మన్ కృతజ్ఞతలు



లోకేష్‌ను కలిసిన దివాకర్‌రెడ్డి

తిరుపతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తిరుపతి శెట్టిపల్లె భూముల సమస్యను కేబినెట్ సమావేశం అజెండాలో ప్రవేశపెట్టి సమస్యను పరిష్కరించడానికి విశేషంగా కృషి చేసిన మంత్రి లోకేశ్‌కు తుడాచైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వంద రోజుల్లో చేసిన అభివృద్ధి పనులను మంత్రికి తుడా చైర్మన్ వివరించారు. ఈ సందర్భంగా దివాకర్‌ను లోకేష్ అభినందించారు. త్వరలో శెట్టిపల్లి లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేసి, లేఅవుట్ అభివృద్ధి చేసి వారికి అందజేయాలని మంత్రి సూచించారు.

వామపక్షాల ఆందోళన



తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారతదేశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీగా సుంకాలు పెంచినా నోరుమెదపని మోదీ ప్రభుత్వం వెంటనే నైతిక బాధ్యత వహించి దిగిపోవాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తిరుపతి ప్రధాన తపాలా కార్యాయం ఎదుట శనివారం సీపీఎం, సీపీఐ, ఐఎఫ్‌టీయూల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, ఐఎఫ్‌టీయూ నేత వెంకటరత్నం మాట్లాడుతూ అమెరికా తమ ఆర్థిక వ్యవస్థను బలపరుచుకోవడానికి ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంపై మోయలేని భారాన్ని సుంకాల రూపంలో విధిస్తున్నా మోదీ ప్రభుత్వం నోరు మెదపక పోవడం అన్యాయమని విమర్శించారు. నాయకులు జయచంద్ర, వేణుగోపాల్, సుబ్రమణ్యం, మాధవ్, బుజ్జి, జి.పెంచలయ్య, విశ్వనాథం, చలపతి, ప్రమీల, లోకేష్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధికి సన్మానం



జల్లి మధుసూదన్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘాల నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్‌కు బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. జల్లి మధుసూదన్ ఇటీవల రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన సందర్భంగా ఏపీ బీసీ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక కెన్సెస్ హోటల్లో శనివారం సన్మాన కార్యక్రమం జరిగింది. సమాఖ్య వ్యవస్థాపకులు ఎన్నగోని తులసీరామ్, టి. గోపాల్ తదితర నాయకులు, జల్లి మధుసూదన్ అభిమానులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తులసీరామ్, గోపాల్ మాట్లాడుతూ... జల్లి మధుసూదన్ బీసీల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్ట భాస్కర్‌యాదవ్, సూరలూరి కోటేశ్వరరావు, గణేష్‌బాబు, కోశాధికారి సునీల్‌దత్, బీసీ ఉద్యోగ సంఘ నాయకులు శేఖర్‌బాబు, శ్రీనివాసులు, గవ్వల ప్రసాద్, లోకనాథం, కవి, గాయకులు ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరులో అక్టోబరు 13, 14 తేదీల్లో సీఐటీయూ జిల్లా మహాసభలు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): అక్టోబరు 13, 14 తేదీల్లో పుత్తూరు పట్టణంలో సీఐటీయూ జిల్లా మహాసభలు నిర్వహిస్తామని జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. శనివారం ఎంబీభవన్‌లో జరిగిన సీఐటీయూ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సభల్లో పోరాట ప్రణాళికలు రూపొందిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు బాలసుబ్రమణ్యం, వి.నాగరాజు, జయచంద్ర, ప్రసాదరావు, వేణు, మాధవ్, ఆర్.లక్ష్మీ, బుజ్జి, మునిరాజ, కవిత తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు బాసటగా నిలుస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9న వైసీపీ నిర్వహించనున్న అన్నదాత పోరు పోస్టర్‌ను శనివారం నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్, మేయర్ డాక్టర్ శిరీష ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సరిపోయేవిధంగా యూరియా పంపిణీ చేయనందుకు నిరసనగా ఈ నెల 9న స్థానిక ఆర్డీవో కార్యాలయాల వద్దకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రాలను సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, రైతు విభాగం నాయకులు చంద్రమౌళిరెడ్డి, తలారి రాజేంద్ర, అజయ్‌కుమార్, వాసుదేవయాదవ్, షఫీ ఖాద్రి, కొటాల చంద్ర, నల్లాని బాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి వర్సిటీలో ఉపాధ్యాయ దినోత్సవం



ప్రొఫెసర్ శోభారాణిని సన్మానిస్తున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ సావేరీ హాల్లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఉమ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ.. విలువల స్థాపనకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం ప్రొఫెసర్ శోభారాణి(జర్నలిజం), ప్రొఫెసర్ ఉషారాణి(కంప్యూటర్‌సైన్స్), ప్రొఫెసర్ కుమారి(మైక్రోబయాలజీ), ప్రొఫెసర్ నిర్మల(ఇంగ్లీషు), ప్రొఫెసర్ రజిత(ఫార్మసీ), డాక్టర్ వాణి(మైక్రోబయాలజీ), శాంతిప్రియ(ఎంబీఏ) కు పరిశోధనా అవార్డులను అందజేసి సత్కరించారు.

క్రీడాకారులకు శాప్ ఛైర్మన్ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కరాటే, బాక్సింగ్‌లో మరింత మెరుగ్గా రాణించి అత్యధిక పతకాలు సాధించాలని శాప్ ఛైర్మన్ రవినాయుడు క్రీడాకారులను ప్రోత్సహించారు. తిరుపతికి చెందిన కరాటే, బాక్సింగ్ క్రీడాకారులు విద్యశ్రీ, విష్ణుప్రియ, జానవి, అభినాథ్, ఆయా అసోసియేషన్ ప్రతినిధులతో శనివారం ఉదయం క్యాంపు కార్యాలయంలో రవినాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో చిల్డ్రన్ అండ్ క్యాడెట్స్ నేషనల్ కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్, హర్యానాలోని కురుక్షేత్ర యూనివర్శిటీలో నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో రాణించి మెడల్స్ కైవసం చేసుకున్నట్లు ఆయన దృష్టికి తెచ్చారు. కాగా వారు సాధించిన మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిథ్యం వహించి సత్తాచాటాలని ఆయన కోరారు.

సింగరాజు సచ్చిదానందం వద్ద చదువుకోవడం నా అదృష్టం

- అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్



మేడసాని మోహన్‌ను సన్మానిస్తున్న డాక్టర్ భీమన్న తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సింగరాజు సచ్చిదానందం వంటి గురువు వద్ద చదువుకోవడం తన అదృష్టమని అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ తెలుగు విభాగంలో శనివారం సింగరాజు సచ్చిదానందం స్మారకోపన్యాసం చేశారు. సింగరాజు చొరవతోనే తాను అష్టావధానంలో రాణించానని గుర్తు చేసుకున్నారు. విద్యా, సాహిత్య, సామాజిక సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి సింగరాజు సచ్చిదానందం అని కొనియాడారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎన్.భీమన్న మాట్లాడుతూ.. సింగరాజు సచ్చిదానందం జీవితం అందరికీ ఆదర్శనీయమని అన్నారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల రెడ్డి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎన్. భీమన్న, తేజోవాణి, ప్రసాదరావు, లోకనాథ మందడి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ మూడవ సబ్ డివిజన్ పరిధిలోని తిరుచానూరు సెక్షన్‌లో పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ సబ్ డివిజన్ డీఈఈ జయప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా తిరుచానూరు, వైష్ణవీనగర్, వసుంధరానగర్, యోగిమల్లవరం, కె.పి.లేఅవుట్, శిల్పారామం, కెఆర్.నగర్, గజలక్ష్మీనగర్, నేతాజీ స్ట్రీట్, సీఆర్ రాజన్ కాలనీ, దామినేడు సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ విజ్ఞప్తిచేశారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సరఫరా అంతరాయాన్ని దృష్టిలో వుంచుకొని తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నవోదయ, సైనిక్ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

తిరుపతి(విద్య), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నవోదయ, సైనిక్, మిలిటరీ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని విశ్వం విద్యా సంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి చెప్పారు. శనివారం స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో నవోదయ, సైనిక్ తదితర పోటీ పరీక్షలపై జరిగిన అవగాహనా సదస్సుకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్‌లో చదివిన విద్యార్థులకు భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని వివరించారు. 2026-27 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతులకు నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు ఈనెల 23వ తేదీ అని వెల్లడించారు. గడువులోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు సంబంధించి మరిన్ని వివరాల కొరకు 86888 88802 / 93999 76999 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

14న బలిజ సేన సమావేశం



మాట్లాడుతున్న ఆర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోటల్ ఉదయ్ ఇంటర్నేషనల్‌లో ఈ నెల 14వ తేదీన బలిజ సేన రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ బలిజ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బలిజ సేన ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సురేష్, నాయకులు కేఎస్‌ప్రసాద్, ఆముదాల వెంకటేష్, బసికర్ల రఘు, సుబ్రమణ్యం, రామారావు తదితరులు పాల్గొన్నారు.

6న రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గ ఎన్నికలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సాధారణ సమావేశం అక్టోబరు 6న నిర్వహిస్తున్నట్లు తిరుపతిశాఖ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా కార్యదర్శి ప్రతీత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో అక్టోబరు 6న సోమవారం కొత్త జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు తమ సభ్యత్వ కార్డు, ఆధార్ తీసుకుని ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.

నేడు విశ్వరూప యాత్ర

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి ద్వారకానగర్‌లోని కంచి కామకోటి మహా పాదుక మండపం ఆధ్వర్యంలో ఆదివారం విశ్వరూప యాత్ర నిర్వహిస్తున్నట్లు ఈ పీఠం నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంచి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతీ, సత్యచంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వాముల చతుర్మాస వ్రత దీక్ష ముగుస్తున్న సందర్భంగా ఈ యాత్ర చేస్తున్నట్లు చెప్పారు. మహా పాదుక మండపం నుంచి దివ్యారామం ఉద్యానవనం వరకు ఈయాత్ర సాగుతుందన్నారు. భక్తులు ఈ యాత్రలో పాల్గొనాలని కోరారు.

వినాయకుడి కామాక్షమ్మ దీపాల కోసం ఎగబడిన భక్తజనం





కామాక్షమ్మ దీపాలతో ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమ, దీపాల కోసం ఎగబడుతున్న భక్తులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కరిమారియమ్మ ఆలయ సమీపంలోని యాదవవీధిలో కామాక్షమ్మ దీపాలతో ఏర్పాటు చేసిన వినాయకుడి సన్నిధిలో ఆ దీపాల కోసం భక్తజనం ఎగబడ్డారు. చవితి ఉత్సవాలను పురస్కరించుకుని సుమారు 4,500ల కామాక్షమ్మ దీపాలతో వినాయకుడి ప్రతిమను రూపొందించారు. ఉత్సవాలను 11 రోజులపాటు ఘనంగా నిర్వహించి ఆఖరి రోజైన శనివారం నిమజ్జనం సందర్భంగా వినాయక ప్రతిమను రూపొందించిన దీపాలను భక్తులకు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఈ విషయం తెలుసుకున్న భక్తజనులు అధిక సంఖ్యలో చేరుకుని ఆ దీపాల కోసం ఎగబడడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి భక్తులను అదుపుచేసి పరిస్థితిని చక్కబెట్టారు. అనంతరం కామాక్షమ్మ దీపాల పంపిణీ సజావుగా సాగింది. ఈ సందర్భంగా వినాయకుడి లడ్డు వేలం నిర్వహించగా కర్నాలవీధికి చెందిన సాయిగుప్తా రూ.2లక్షల 60వేలకు, వెండి జంజంను లక్షా రెండు వేల రూపాయలకు దొడ్డాపురం వీధికి చెందిన వినయ్‌రెడ్డి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు ఆనంద్, లోకేష్, దయా, వెంకటసాయి, శేషు, నవీన్, పవన్, గంగాధర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నిమజ్జనం





మూషిక వాహనంపై నిమజ్జనానికి వెళుతున్న గణేశుడు, క్రేన్‌తో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని 11వ రోజు శనివారం నిమజ్జన కార్యక్రమాన్ని స్థానిక వినాయకసాగర్‌లో ఘనంగా నిర్వహించారు. నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించి, మండప నిర్వాహకులు నిమజ్జనాన్ని పూర్తి చేశారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు తిరుపతికి చెందిన విజయదీపిక రూ.1,11,116 శనివారం విరాళమిచ్చారు. దీనికి సంబంధించిన డీడీని సూపరింటెండెంట్ కోదండపాణికి అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ



చికిత్స పొందుతున్న కండక్టర్ రత్నం

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఐతేపల్లి జాతీయరహదారిలో శనివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను రుయా ఆస్పత్రిలోని అత్యవసర విభాగంలో ఆర్టీసీకి చెందిన డీపీటీవో జగదీష్, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం పరామర్శించారు. కండక్టర్‌తో సహా 19మంది ప్రయాణికుల దగ్గరకెళ్లి తామున్నామని భరోసా ఇచ్చారు. అత్యవసర ఖర్చులకు నగదు అందజేశారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. అలాగే రాయలసీమ జోనల్ ఛైర్మన్ పూజ నాగరాజు ఫోన్ ద్వారా ప్రయాణికుల ఆరోగ్య పరిస్థితిని విచారించారు. బాధితులు త్వరగా కోలుకునేలా వైద్యసేవలందించాలని ఆదేశించారు. డీపీటీవో జగదీష్ మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులకు దేవుడి దయతో ప్రాణాపాయం తప్పిందన్నారు. కండక్టర్ పి.వి.రత్నంకు దెబ్బలు ఎక్కువగా ఉండడంతో నారాయణ ఆస్పత్రికి తరలించామన్నారు. ఇకపై రాత్రి వేళలో బెంగళూరు తదితర పైప్రాంతాల నుంచి నడిచే బస్సులను చిత్తూరుటౌన్ బస్టాండు మీదుగా ప్రయాణించేలా ఆదేశాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అక్కడ దిగేవారు లేకపోయినా బస్టాండులో కాసేపు ఆపి ప్రతి డ్రైవర్ చల్లటినీటితో మొహం శుభ్రం చేసుకోవాలని, ఆ తరువాత టీ తాగి బయల్దేరేలా కఠిన నిబంధన పెడుతామన్నారు. నిర్లక్ష్యం చేసిన సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులతో పాటు శ్రీకాళహస్తి, అలిపిరి డిపోల మేనేజర్లు మునిచంద్రయ్య, హరిబాబు ఉన్నారు.

ఉపాధ్యాయనగర్ రోడ్డులో ఆక్రమణలు తొలగించండి



ఉపాధ్యాయనగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని 50వ డివిజన్ ఉపాధ్యాయనగర్ రోడ్డులో ఆక్రమణలను వెంటనే తొలగించాలని నగరపాలకసంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా వచ్చిన వినతులను శనివారం సంబంధిత అధికారులతో కలిసి ఉపాధ్యాయనగర్, మానస సరోవర్ మార్గాలను పరిశీలించారు. ఉపాధ్యాయ నగర్ ప్రధాన మార్గంలో వాహన రాకపోకలకు పడుతున్నామని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి ఆక్రమణలు తొలగించేలా వెంటనే చర్యలుచేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్ సుందర్, ఎంఈ గోమతి, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసీపీ మూర్తి, డీఈ శిల్ప, స్థానిక అసోసియేషన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

'టీటీడీని ప్రయోగశాలగా మార్చొద్దు'

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి దేశవ్యాప్తంగా ఉన్న దేవాలయాల సంరక్షణకు పదవీవిరమణ చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించే నోటిఫికేషన్‌పై పునఃపరిశీలన చేయాలని, టీటీడీని ప్రయోగశాలగా మార్చవద్దని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. టీటీడీ ఉద్యోగస్తుల పదోన్నతులపై న్యాయసలహా తీసుకుని తక్షణమేపరిష్కరించాలన్నారు. స్విమ్స్‌లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న వారికి న్యాయంచేయాలని సీఎం చంద్రబాబు, దేవదాయశాఖ మంత్రి రామనారాయణ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. వైద్యులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి పదోన్నతి కల్పించి జీతాలు పెంచేలా ధర్మకర్తలమండలి ఆదేశాలు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శ్రీవారి భక్తుల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు నవీన్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేస్తూ లేఖ రాశారు.

తబ్లీ ఇస్తీమా సభ అనుమతులు రద్దు చేయాలి

- ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి



మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పవిత్ర తిరుపతి పుణ్యక్షేత్రంలో తబ్లీ ఇస్తీమా సభకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ నిత్యం గోవింద నామస్మరణలు వినిపించే తిరుపతిలో ఈ నెల 14, 15 తేదీల్లో అన్యమతస్తుల సభలకు ఎలా అనుమతులిస్తారని ప్రశ్నించారు. తబ్లీ జమాతేను ముస్లిం దేశాలే తీవ్రవాద మూలాలున్నాయనే ఆరోపణల నేపథ్యంలో నిషేధించాయని తెలిపారు. ఆ సంస్థ అనుబంధంగా ఉన్న నాలుగింటిలో ఇప్పుడు సభ నిర్వహణకు అనుమతులు తీసుకున్న తబ్లీ ఇస్తీమా కూడా ఒకటని ఆరోపించారు. ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో మరో పది రోజుల్లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో అన్యమతస్తుల సభలకు అనుమతి ఇవ్వడం ఎంతవరకు సమజసమని ప్రశ్నించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించినా స్పందన లేదన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి జమ్మూకాశ్మీర్‌లో ఈ సంస్థ సభ నిర్వహణకు శాంతిభద్రతల కారణంగా అనుమతులివ్వ లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి సభ నిర్వహణకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ సనాతన ధర్మ పరిరక్షణ సభ్యులు కిరణ్‌కుమార్, బాలకృష్ణ, చేతన్‌గాడ్ తదితరులు పాల్గొన్నారు.


జస్టిస్ వైద్యనాథన్


జస్టిస్ మన్మధరావు


జస్టిస్ ఇందిరేష్


జస్టిస్ అనిరుధ పీ మాయి

తిరుమలలో పలువురు న్యాయమూర్తులు

తిరుమల శ్రీవారిని శనివారం వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు దర్శించుకున్నారు. వీరిలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మన్మధరావు, జస్టిస్ ఈఎస్ ఇందిరేష్, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిరుధ పీ మాయి, మేఘాలయ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్ ఉన్నారు. ఇంకా నటుడు దాసరి అరుణ్‌కుమార్ కూడా స్వామిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వ దర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ బాటగంగమ్మ ఆలయ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.49 కోట్లు


శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 69,531

తలనీలాలు సమర్పించినవారు: 31,439



యోగా.. శరీరాన్నీ, మనసునూ నియంత్రించే గొప్ప ప్రక్రియ. మనదేశ సాంస్కృతిక సంపదలో భాగమైన ఈ ఆరోగ్య ప్రక్రియ ఇప్పుడు బాగా ప్రాచుర్యం పొందింది. అయితే 55ఏళ్ల క్రితమే దీని ప్రాధాన్యతను గుర్తించి అనుసరించారు గూడూరుకు చెందిన కట్టా మురళీకృష్ణ. ఆసనాలను అతి సులభంగా వేస్తూ ఆ రోజుల్లోనే అబ్బురపరిచేవారు. ఆయన వారసత్వాన్నే పుణికి పుచ్చుకున్న ఆయన మనవడు మరో అడుగు ముందుకేశాడు. యోగాలో కష్టతరమైన శలభాసనం వేసి గిన్నిస్ రికార్డు సాధించాడు. అందరి దృష్టినీ ఆకట్టుకుని ఔరా అనిపించుకుంటున్నాడు. యోగాసనాలు వేసేవారికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడీ పిన్న వయస్కుడు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి




ఎమ్మెల్యే సునీల్‌కుమార్ చేతుల మీదుగా గిన్నిస్ రికార్డు అందుకుంటూ..

శలభాసనంలో శెభాష్.. ద్వారకేష్

● యోగాలో క్లిష్టమైన ప్రక్రియలో గిన్నిస్ రికార్డు

కట్టా వెంకట ద్వారకేష్.. గూడూరు సొసైటీ కాలనీకి చెందిన ఈ యువకుడు బెంగళూరులో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. యోగా రంగంలో అద్భుతాలు ఆవిష్కరిస్తున్నాడు. ఇతని తాత మురళీకృష్ణ 1970లో ఆధ్యాత్మిక యోగ వెల్ఫేర్ అసోసియేషన్‌ను స్థాపించారు. యోగా గురువుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈయన కుమారుడు రాజ్‌కుమార్ కూడా తండ్రిని అనుసరించాడు. 1996లో గూడూరులో మొదటిసారిగా యోగా, జిమ్ సెంటర్‌ను ప్రారంభించారు. పట్టణ ప్రజలకు ఆరోగ్యకరమైన శరీరసౌష్టవ సాధన, యోగాల గురించి లోతుగా పరిచయం చేశాడు. తండ్రి, తాతల ప్రభావంతో ద్వారకేష్ కూడా ఇదే రంగంపై మక్కువ పెంచుకున్నాడు. చిన్నతనం నుంచే కఠోర ఆసనాలను సాధన చేయడం ప్రారంభించాడు. శరీరాన్ని ధనుస్సులా వంచేయడం అలవాటు చేసుకున్నాడు. 2006లో చెన్నైలో జరిగిన జాతీయస్థాయి యోగ పోటీలలో ప్రతిభను చాటి బంగారు పతకాన్ని సాధించాడు. పాఠశాల నుంచి అన్ని స్థాయిల్లోనూ నిర్వహించే యోగాసనాల పోటీలలో ప్రతిభ చాటాడు ద్వారకేష్. ఈ క్రమంలోనే గతేడాది చెన్నైలో నిర్వహించిన ఖేలో ఇండియాలో 345 నిమిషాల పాటు శలభాసనం వేసి అబ్బురపరిచాడు. ప్రపంచ గిన్నిస్ బుక్ రికార్డులో స్థానం సాధించగలిగాడు.

ఏమిటీ ఆసనం :

క్రమశిక్షణ, కఠోరసాధన, మనో ధైర్యం, మానసిక సమతుల్యత, ఊపిరి నియంత్రణపై పట్టు ఉంటే తప్ప ఈ తరహా శలభాసన ప్రక్రియలో ఎక్కువసేపు కొనసాగడం కష్టమని యోగా నిపుణులు చెబుతారు. ఈ యోగా భంగిమలో బోర్లా పడుకుని కాళ్లూ, ఛాతిని నేల నుంచి పైకి లేపుతూ మిడత ఆకారాన్ని అనుకరిస్తారు. అందుకే దీనిని మిడతాసనం అని కూడా అంటారు. ఈ ఆసనం వెన్నెముక, వీపు కండరాలకు బలాన్నిస్తుందని ద్వారకేష్ చెబుతాడు. జీర్ణ ప్రక్రియ మెరుగుపరచడంలోనూ, పొత్తి కడుపులో పేరుకుపోయే కొవ్వును కరిగించడానికి దోహదపడుతుందంటున్నాడు. అనేక అనారోగ్య సమస్యలను యోగా ద్వారా నయం చేసుకోవచ్చునని అంటున్నాడీ యువకుడు. భవిష్యత్తులో యోగా శిక్షణ సంస్థలను ఏర్పాటు చేసి యువతను యోగాసనాల వైపు నడిపించాలనే లక్ష్యమని ఆంధ్రజ్యోతికి వివరించాడు ద్వారాకేష్.


శలభాసనంలో ద్వారకేష్

మల్లికార్జున ప్రయాణం స్ఫూర్తిదాయకం

సత్యవేడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):ఒకప్పుడు శ్రీసిటీలో ఉద్యోగిగా పయనం మొదలుబెట్టి, నేడు పారిశ్రామికవేత్తగా ఎదిగిన మల్లికార్జున ప్రస్థానం యువతకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిదాయకమని వీఎస్ఎన్ఎల్ మాజీ ఛైర్మన్, ఏపీ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు, పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి కొనియాడారు.శ్రీసిటీలో శుక్రవారం వ్యక్తిగత పరిశుభ్రత ఉత్పత్తులు (శానిటరీ న్యాప్‌కిన్స్) తయారు చేసే స్మైల్ ఎకో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ప్రారంభమైంది.హనుమాన్ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, స్మైల్ ఎకో మేనేజింగ్ డైరెక్టర్ పరుచూరి మల్లికార్జున సమక్షంలో పరిశ్రమను లాంఛనంగా ప్రారంభించారు. రూ.20 కోట్ల పెట్టుబడితో స్థాపించిన ఈ ప్లాంట్ ఏడాదికి 259.2 మిలియన్ల శానిటరీ న్యాప్‌కిన్‌లను తయారు చేస్తుంది. దాదాపు 200 మందికి పైగా ఉద్యోగాలు లభిస్తాయి. ఇక్కడి ఉత్పత్తులను దేశీయ మార్కెట్‌తో పాటు విదేశాలకు ఎగుమతులు చేస్తారు. పరిశ్రమ ఎండీ మల్లికార్జునను శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. వరదయ్యపాళెం మండలంలోని వెంకటరెడ్డి కండ్రిగకు చెందిన మల్లికార్జున ఒకప్పుడు శ్రీసిటీలో ఉద్యోగిగా పయనం మొదలు బెట్టి, నేడు పారిశ్రామికవేత్తగా ఎదగడం యువతకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సంతోషదాయకమన్నారు.


పరిశ్రమను ప్రారంభిస్తున్న హనుమాన్ చౌదరి

తిరుమలలో శాస్త్రోక్తంగా చక్రస్నానం

తిరుమల, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభవ్రతం సందర్భంగా శనివారం ఉదయం తిరుమల శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంత పద్మనాభవ్రతాన్ని ఏటా భాద్రపద శుక్ల చతుర్దశి రోజున నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో ఉదయం పూజలు చేసిన తర్వాత సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి వరాహస్వామి ఆలయం చెంత ఉన్న పుష్కరిణిలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేపట్టారు. అనంతరం చక్రస్నానాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

● 35 గ్రాముల బంగారు, 350 గ్రాముల వెండి ఆభరణాల స్వాధీనం

బంగారు వెండి ఆభరణాలతో దొంగ అరెస్టు చూపిస్తున్న గాజుల మండ్యం పోలీసులు →



రేణిగుంట, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రాత్రిపూట ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ తంగ ముత్తును గాజులమండ్యం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు వివరాల మేరకు.. గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021 నుంచి రాత్రిపూట ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీ చేస్తున్న ఘటనలు నమోదయ్యాయి. వేలిముద్రల ఆధారంగా తమిళనాడు రాష్ట్రం తూత్తుకుడి జిల్లా తిరుచెందూరుకు చెందిన తంగముత్తు ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మరో చోరీకి సన్నద్ధమయ్యే క్రమంలో శనివారం ఉదయం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తచ్చాడుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 35 గ్రాముల బంగారం, 350 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన గాజులమండ్యం సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్ఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుళ్లు గోపి, రాజేష్, సుబ్రహ్మణ్యం, కానిస్టేబుళ్లు వేణుగోపాల్, గోపి, మణి, మురళి వాసును అభినందించి, రివార్డులు అందజేశామని డీఎస్పీ తెలిపారు.

ఫ్రిక్షన్ ఆధారిత రంగంలో సవాళ్లను అధిగమించాలి

● భావితరాల పరిశోధకులకు ఇన్‌స్పైర్‌గా ఐసీఎఫ్‌పీ సదస్సు ● మిధాని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి

తిరుపతిరూరల్, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): ఫ్రిక్షన్ (ఘర్షణ) ఆధారిత ప్రాసెసింగ్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడంలో పరిశోధకులు కీలకపాత్ర పోషించాలని హైదరాబాద్‌కు చెందిన మిధాని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి పేర్కొన్నారు. తిరుపతిలోని ఓల్డ్ తిరుచానూరు రోడ్డులో ఉన్న ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ ప్రాసెసింగ్ ఆఫ్ మెటీరియల్స్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ ప్రొడక్ట్స్(ఐఏ-పీఎంఎఫ్‌పీ) ఆధ్వర్యంలో తిరుపతి ఐఐటీ, పాట్నా ఐఐటీ, ఐఐఎస్సీ (బెంగళూరు) సహకారంతో మూడ్రోజుల ఫ్రిక్షన్ బేస్డ్ ఇంటర్నేషనల్ సదస్సు(ఐసీఎఫ్‌పీ-2కె25)ను శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సదస్సుపై రూపొందించిన పుస్తకాన్ని ఐసీఎఫ్‌పీ అధ్యక్షుడు సత్యం సువాస్, బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ సతీష్ విక్లైలాష్, తిరుపతి ఐఐటీ డీన్ ప్రొఫెసర్ అరుణ్‌తంగిరాల, ఐఏ-పీఎంఎఫ్‌పీ అధ్యక్షుడు ప్రొఫెసర్ టీఎస్ శ్రీవాత్సవ్‌లతో కలసి ఆయన ఆవిష్కరించారు. నారాయణమూర్తి మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల పరిశోధకులకు ఈ సదస్సు ఇన్‌స్పైర్‌గా ఉంటుందని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న ఈ రంగంలో పరిశోధకులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కాగా ఘర్షణ ఆధారిత తయారీ, స్మార్ట్ మ్యానుఫాక్చరింగ్ తయారీ, సాంకేతికతల అభివృద్ధిపై పలువురు వక్తలు ఉపన్యసించారు. కన్వీనర్‌గా తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ అజయ్‌కుమార్ వ్యవహరించారు. 8దేశాలకు చెందిన అంతర్జాతీయ పరిశోధకులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణమూర్తి, సత్యం సువాస్ తదితరులు

శ్రీసిటీలో చెన్నై ఏంజిల్స్ ప్రతినిధుల బృందం


ప్రతినిధుల బృందంతో శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఏంజిల్స్‌కు చెందిన 19 మంది ప్రతినిధుల బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. కె.మహాలింగం నేతృత్వంలోని బృంద సభ్యులకు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రపంచ శ్రేణి మౌలిక వసతులు, వ్యాపార అనుకూలమైన వ్యవస్థలను వివరించారు. శ్రీసిటీ పర్యటనలో ఉన్న వీఎస్ఎన్ఎల్ మాజీ ఛైర్మన్, పద్మశ్రీ డాక్టర్ హనుమాన్ చౌదరితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టెలికం రంగంలో అపార అనుభవం ఉన్న చౌదరి, ఆయన అనుభవాలను, పలు సాంకేతిక పురోగతికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీసిటీ పారిశ్రామిక కార్యకలాపాలు, ఇక్కడ అనుసరిస్తున్న పద్ధతులు అధ్యయనం, పెట్టుబడి అవకాశాల పరిశీలన దిశగా బృందం పర్యటన సాగింది. అనంతరం శ్రీసిటీలోని డైకిన్, ఇసుజు, కోల్గేట్, ఎప్సాక్, ఎవర్ ఓల్డ్, సీఈటీసీ తదితర పరిశ్రమలను బృందం సందర్శించింది.

శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ

● నేడు పద్మావతీ అమ్మవారి ఆలయం మూసివేత

తిరుచానూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొపి సహస్రనామార్చన, నిత్యార్చన చేపట్టారు. తర్వాత అమ్మవారి మూలమూర్తికి, ఉత్సవర్లకు, ఉపాలయాలకు, పరివార దేవతలకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు యాగశాలలో ఆరాధన, హోమాలు, నివేదన తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా, చంద్రగ్రహణంలో భాగంగా అమ్మవారి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 2.15 గంటలకు మూసివేయనున్నారు. తిరిగి సోమవారం వేకువజామున తలుపులు తెరచి, ఆలయ శుద్ధి, సంప్రోక్షణ తర్వాత భక్తులకు అమ్మవారు దర్శన భాగ్యం ఇవ్వనున్నారు.


ఉత్సవమూర్తికి పవిత్రమాలలు సమర్పిస్తున్న అర్చకులు

కారు దగ్ధం



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంటలు చెలరేగి కారు దగ్ధమైన ఘటన తిరుపతి మంగళం రోడ్డులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. తిరుపతి అగ్నిమాపక దళాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి వివరాల మేరకు.. తిరుచానూరుకు చెందిన ఎంటీ కిరణ్ కుటుంబ సభ్యులతో కలసి తిరుపతి మంగళం రోడ్డులోని సురక్ష ఆసుపత్రికి కారులో వస్తున్నారు. ఫ్లైవోవర్ వద్ద వెళుతుండగా ఇంజిన్ వేడెక్కి మంటలు చెలరేగాయి. వెంటనే కారులో ఉన్న వారు కిందకు దిగేశారు. ఆ మార్గంలో వెళుతున్న అలిపిరి సీఐ రాంకిషోర్ తన సిబ్బంది సహాయంతో మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఎస్ఐ నాగార్జున రెడ్డి కేసు నమోదు చేశారు.

వెంకటగిరికి చేరిన పర్యావరణ ప్రేమికుడి యాత్ర

వెంకటగిరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితం కోరుతూ తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ముత్తు సెల్వన్ చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం వెంకటగిరికి చేరింది. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ఆయన పట్టణంలోని విశ్వోదయ కాలేజీ గ్రౌండ్‌లో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ముత్తు సెల్వన్ 2021లో సైకిల్ యాత్రను ప్రారంభించి, నాలుగేళ్లుగా కొనసాగిస్తుండటం అభినందనీయమన్నారు. ముత్తు సెల్వన్ మాట్లాడుతూ కరోనా కాలంలో ఆక్సిజన్ కొరతతో జనాలు చనిపోవడం చూసి బయోమెట్రికల్ ఇంజనీరుగా పనిచేస్తున్న తాను విధులకు రాజీనామా చేసి సైకిల్ యాత్ర చేపట్టానన్నారు. పర్యావరణ ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్యపరుస్తూ ఎనిమిది దేశాలలో సైకిల్ యాత్ర పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు నేపాల్, బంగ్లాదేశ్‌లో పర్యటన పూర్తయిందని, మన దేశంలో 23 రాష్ట్రాలు, ఏపీలో 10 జిల్లాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో యాత్ర పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 1,356 రోజులు 38,600 కిలోమీటర్లు ప్రయాణించినట్లు వెల్లడించారు. 8లక్షల మొక్కలు నాటినట్లు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ఆయన్ను సత్కరించి, ఆర్థిక సాయం అందించారు.


ఎమ్మెల్యేతో కలిసి మొక్కనాటుతున్న పర్యావరణ ప్రేమికుడు ముత్తు సెల్వన్

ఉపాధి బకాయిలు రూ.50.20కోట్లు

● 16 వారాలుగా కూలీలకు అందని వేతనాలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మే నుంచి ఇప్పటివరకు రూ.50.20 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. మెటీరియల్ కాంపోనెంట్(సీసీరోడ్లు, డ్రైన్లు, గోకులాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి) కింద రూ.70 కోట్లు రావాల్సి ఉంది. గడచిన నాలుగు నెలలు(16 వారాలు)గా కూలీలకు బిల్లులు సరిగా ఇవ్వడం లేదు. ఈ కారణంతో పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. జిల్లాలోని 774 పంచాయతీల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 53 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. మరో 8 నెలల్లో 50 లక్షల పనిదినాలు పూర్తి కావాల్సి ఉంది. బిల్లులు రాకపోవడంతో కుటుంబం గడవటం కష్టమవుతోందని, ప్రతివారమూ ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

త్వరలోనే బకాయిలు చెల్లిస్తాం

● శ్రీనివాసప్రసాద్, డ్వామా పీడీ

ఉపాధి హామీ పథకం కూలీలకు త్వరలోనే వారి ఖాతాకు బకాయిలు జమచేస్తాం. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉంది. జిల్లాలో 16 వారాలకు సంబంధించి 1.71లక్షల మంది కూలీలకు రూ.50కోట్లపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం చేసిన అభివృద్ధి పనులకు మరో రూ.70కోట్లు రావాల్సి ఉంది.

పుత్తూరు వార్తలు

ఆర్టీసీ డీఎంగా మహేంద్ర



పుత్తూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజరుగా మహేంద్ర శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి డిపో నుంచి పదోన్నతిపై ఆయన ఇక్కడకు వచ్చారు. గతంలో ఆయన ఇక్కడ మెకానికల్ ఫోర్‌మన్‌గా పనిచేశారు. బస్సులు సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఎన్‌ఎంయూఏ, ఈయూ కార్మికసంఘాల నాయకులు డీఎంను సన్మానించారు.

జెండామాను వీధి గణనాథుడికి పూజలు



పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక జెండా మాను వీధిలో కొలువుదీరిన గణనాథుడికి శనివారం విశేష పూజలను నిర్వహించారు. శనివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు దర్శించుకున్నారు. తామర పుష్పంలో గణనాథుడిగా ముంగిట శివలింగం ఏర్పాటు చేయడంతో భక్తులను పరవశింపజేసోతంది. ఈ కార్యక్రమంలో మణికంఠ, పోతుగుంట రమేష్, కౌషిక్, ఉదయ్, శివ, లీలా కృష్ణ, కార్తీక్, నరేష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పుత్తూరు,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కోర్సుకు ఈనెల 15వ తేదీలోగా కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ చంద్రమౌళి కోరారు. మూడున్నర నెలల కోర్సుకు టెన్త్ ఉత్తీర్ణత కనీస అర్హత అన్నారు. కళాశాలలో రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు, మార్కుల లిస్ట్, ఫొటోను తీసుకురావాలన్నారు. వివరాలకు నెం.6300954441లో సంప్రదించవచ్చు.

కలకలం రేపిన స్టాకు బోర్డు



పుత్తూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెస్తవీధి చౌకదుకాణం బోర్డులో బియ్యం అయిపోయిందని ఉండడంతో కార్డుదారులు ఆందోళన చెందారు. ఈ విషయమై చౌకదుకాణ డీలరును విచారించగా తమ కు కేటాయించిన 600 రేషన్ కారులకు సరిపడా స్టాకు శుక్రవారం సాయంత్రానికి పూర్తి చేశామన్నారు. పక్క వీధుల్లోని కార్డుదారులు పోర్టు కింద వస్తుండడంతో స్టాకు అయిపోయిందని బోర్డులో రాశామని తెలిపారు. ఈ విషయం తెలియక వాట్సప్‌లో బోర్డు ఫొటోలు హల్‌చల్ చేశాయి.

ట్రంప్ సుంకాలను వ్యతిరేకించాలి

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): భారత్‌పై అమెరికా విధిస్తున్న 50 శాతం సుంకాలను వ్యతిరేకించాలని వామపక్షాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి ఆర్.వెంకటేష్, సీపీఐ మండల కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ... మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ట్రంప్ విధానాలను ఎందుకు వ్యతిరేకించకపోతుందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు

నానో ఎరువులతో అధిక దిగుబడి

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): నానో ఎరువులతో అధిక దిగుబడి రావడమే కాకుండా సాగు ఖర్చులు తగ్గుతాయని పుత్తూరు డివిజన్ వ్యవసాయ ఉపసంచాలకురాలు లక్ష్మీదేవి తెలిపారు. శనివారం పుత్తూరు మండలం రామసముద్రం రైతు సేవా కేంద్ర పరిధిలో రైతులకు నానో, జీవన ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు.

రేపు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరాలు

వడమాలపేట/ పుత్తూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 8న సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద పింక్ బస్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు వడమాలపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కే.సందీప్ తెలిపారు. ఆధార్ కార్డు తీసుకురావాలని, బిపి, షుగరు పరీక్షలతోపాటు క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. అలాగే పుత్తూరు మండలంలోని పరమేశ్వరమంగళం పీహెచ్‌సీలో ఈనెల 8న స్విమ్స్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరం జరుగుతుందని వైద్యాధికారి డాక్టర్ హేమభూషణ్‌రెడ్డి తెలిపారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. సుప్రభాతసేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరస్వామిని సర్వాభరణాలు, పూలమాలలతో అలం కరించి ఊయలలో అధిష్ఠింపజేసి వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మ రణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం పద్మావతి, ఆండాల్ సమేత శ్రీవారిని మాడవీధుల్లో ఊరేగించారు. ఆలయ అధికారి వేణుగోపాల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు ఆలయం మూసివేత

చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 1.50 గంటలకు ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ అధికారి వేణుగోపాల్ చెప్పారు. శుద్ధి, సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం 6.15 గంటలకు భక్తులకు దర్శనం కల్పిస్తున్నట్లు చెప్పారు.

జమ్ము గడ్డితో ఇబ్బందులు



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీడుభూముల్లో ఉన్న జమ్ము గడ్డి పూత నుంచి వచ్చే తెల్లటిరవ్వలు గాలిలో తేలియాడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రవ్వలు గాలిలో కలసి ఇళ్లు, హోటల్లు, షాపుల్లోకి ప్రవేశించి తాగునీరు, తినే వస్తువులపై పడుతోంది. అదే విధంగా ద్విచక్రవాహనదారులు కళ్లలోకి పూతరవ్వలు పడుతుండడంతో నానా అవస్థలు పడుతున్నారు. జమ్ము గడ్డిని తొలగించాలని అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులను సక్రమంగా పంపిణీ చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్మార్ట్ రేషన్‌కార్డులను త్వరితగతిన పంపిణీ చేయాలని తహసీల్దార్ శ్రీదేవి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో ఆమె శనివారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో శ్మశాన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాలన్నారు. అన్నదాత సుఖీభవ రాని రైతులు ఆధార్‌కార్డులను పాసుపుస్తకాలతో జత చేయాలన్నారు. పీజీఆర్ఎస్ రోజున వచ్చే వినతులను పరిష్కరించాలన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ట్రంప్ సుంకాలను వ్యతిరేకించాలి



టవర్‌క్లాక్‌సెంటర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

గూడూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతీయ ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాలను ప్రజలందరూ వ్యతిరేకించాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత ఎగుమతులపై సుంకాన్ని 50శాతానికి పెంచడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ప్రధానంగా ఆక్వా, టెక్స్‌టైల్స్ ఉత్పత్తుల ధరలు పడిపోయాయన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులపై కూడా ఆంక్షలు విధించడంతో అమెరికాకు వెళ్లిన విద్యార్థుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, ప్రసాద్, చంద్రయ్య, మణి, కోటి, రమణయ్య, మధు, జిలానీ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి మధ్యాహ్నం చెంగాళమ్మ ఆలయం మూత

సూళ్లూరుపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయాన్ని చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 1గంట నుంచి మూసివేయనున్నట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం అమ్మవారి పునః దర్శనం ప్రారంభమవుతుందని ఆమె పేర్కొన్నారు.

ప్రజాసేవకు యువత ముందుకు రావాలి



నెలవల రాజేష్‌తో వేలూరు కల్యాణ్‌రెడ్డి తదితరులు

పెళ్లకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవ చేసేందుకు యువత ముందుకు రావాలని టీడీపీ యువ నాయకుడు నెలవల రాజేష్ అన్నారు. శనివారం కేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, టీడీపీ నాయకుడు వేలూరు కల్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నెలవల రాజేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. రాజేష్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి భారీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేలూరు సాయి గిరిధర్‌రెడ్డి సునీల్, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్‌అదాలత్

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి కోర్టులో ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని సివిల్ జడ్జి విష్ణువర్మ తెలిపారు. శనివారం కోర్టులో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల సంబంధించిన కేసులన్నీ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకర్లు, న్యాయవాదులు రొంటాల చిన్నా, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

పెళ్లకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీజన్‌కు ముందుగానే జిల్లాల వారీగా రైతుల అవసరాలకు తగ్గటుగా ప్రభుత్వం ఎరువులను సరఫరా చేస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య తెలిపారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలసి మీడియాతో మాట్లాడారు. వైసీపీ నాయకులు యూరియా కొరతంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తగినంత యూరియా అందుబాటులోకి ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, నాయకులు మదన్‌మోహన్ నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, తాళ్ల యుగంధర్ గౌడ్, సన్నాడి వేణురెడ్డి, సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

గూడూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు, మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీడీపీవో మెహబూబి అన్నారు. శనివారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు పోక్సో, బాల్యవివాహాల నిర్మూలన చట్టాలపై అవగాహన కలిగి వుండాలన్నారు. కార్యక్రమంలో శారదాంబ, మాధవీలక్ష్మి, స్వరూపారాణి, హైమావతి, చెంచులక్ష్మి పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ వినియోగించుకోండి

వాకాడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్‌ను వినియోగించుకోవాలని ఎంపీడీవో శ్రీనివా సులు అన్నారు. వాకాడు మండల కార్యాలయం నుంచి అశోక్ పిల్లర్ వరకు వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అల్లంపాడులో గ్రామసభ

కోట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్లంపాడులో శనివారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. ఇటీవల అల్లంపాడు పంచాయతీలో రీసర్వే జరిగింది. రీసర్వే వల్ల ఉపయోగాలను తహసీల్దారు జయజయరావు రైతులకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జునరావు, వీఆర్వో కృష్ణయ్య పాల్గొన్నారు.

మన్నెగుంటలో...

చిల్లకూరు: మండలంలోని మన్నెగుంటలో తహసీల్దారు శ్రీనివాసులు గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ భూములను 18 ఏళ్ల క్రితం కినెటా పరిశ్రమకు కేటాయించారని, అప్పట్లో కొంతమంది రైతులకు అరకొర నష్టపరిహారం చెల్లించగా, కొంతమంది రైతులకు నష్టపరిహారం అందించలేదన్నారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని కోరారు. సర్పంచు ఏడుకొండలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు రోటరీవెస్ట్ క్లబ్ చేయూత

గూడూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రోటరీవెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు చేయూత ఇస్తున్నామని రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ రవీంద్ర అన్నారు. శనివారం స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకాంత్‌రెడ్డి దాతృత్వంతో మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. లక్ష్మి, పీఎం.రావు దంపతుల సహకారంతో హాకీ పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మి, పీఎంరావు, రామకృష్ణ స్వరూప్, మునిగిరీష్, విజయ్‌భాస్కర్ రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, నాశిన నాగులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

14న బలిజ సేన రాష్ట్రస్థాయి సమావేశం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోటల్ ఉదయ్ ఇంటర్నేషనల్‌లో ఈనెల 14వ తేదీన బలిజ సేన రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సేన రాష్ట్ర అధ్యక్షులు అర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ బలిజ, కాపు, ఒంటరి తెగలకు సంబంధించిన సమస్యలపై సమావేశంలో చర్చించి పరిష్కారానికి భవిష్యత్తు ప్రణాళికపై తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి బలిజ సంఘాల నాయకులు తరలివస్తున్నారని తెలిపారు.

పోలేరమ్మ జాతరను ప్రశాంతంగా నిర్వహిస్తాం: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణ, పక్కన ఆలయ ఛైర్మన్ మురళీకృష్ణ, ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాథ నాయుడు

వెంకటగిరి, సెప్టెంబరు6 (ఆంధ్ర జ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర నిర్వహణపై అందరి అభిప్రాయాలను పరిగణన లోకి తీసుకొని ప్రశాతంగా జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో జాతర శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులంద రూ అమ్మవారిని సులభంగా దర్శించుకులా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. గతంలో జరిగిన లోపాలను నివృత్తి చేసుకొంటూ పట్టణప్రజల సూచనలను, సలహా లను తీసుకొని జాతర వైభ వంగా జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. అమ్మ వారి జాతరలో ఆచార సంప్రదాయాలకు ఎలాంటి అవాంతరాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పలువురు పట్టణవాసులు గత జాతరలో జరిగిన లోపాలను గుర్తుచేయడంతో పాటు వాటి నివారణ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో పోలేరమ్మ దేవస్థానం ఛైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, తహసీల్దార్ నర్సింహరావు, సీఐ రమణ, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, తోట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వసతులతో టిడ్కో ఇళ్లు: విజయశ్రీ



టిడ్కో ఇళ్ల వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్ని వసతులతో కూడిన టిడ్కో ఇళ్లను త్వరలోనే లబ్ధిదారులకు అందజేయనున్నట్లు సూళ్లూరు పేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. నాయుడుపేట - చెన్నై జాతీయ రహదారి సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసే విధంగా గత టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు షేర్‌వాల్ టెక్నాలజీతో టిడ్కో గృహాలకు శ్రీకారం చుట్టి 80శాతం పైగా పూర్తిచేశారని తెలిపారు. మిగిలిన పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. కూటమి ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేందుకు మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ చర్యలు చేపట్టడం జరిగింద న్నారు. నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల పరిధిలో సుమారు 5వేల టిడ్కో గృహాలను నిర్మించి పేదలకు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, టీడీపీ నాయ కులు షేక్ రఫీ, నానాబాల సుబ్బారావు, ముత్యాలయ్య, పొట్లపూడి రాజేష్, అశోక్‌రెడ్డి, పార్థసారథి, అవధానం సుధీర్, ఆమవరపు సత్యం, చేవూరు చెంగయ్య, నిత్యకృష్ణారెడ్డి, నారాయణ, రవి, భాస్కర్ పాల్గొన్నారు.

జీవన ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జీవన ఎరువుల వాడకంతో అధిక దిగుబడులను పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులు అవసరానికి మించి రసాయన ఎరువులు వాడటం వల్ల భూమి ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు తెగుళ్ల ఎక్కువగా సోకి ఖర్చులు పెరిగిపోతాయన్నారు. ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులను వాడుకోవడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడి దిగుబడులు పొందవచ్చన్నారు. ఏడీఏ నాగార్జునసాగర్ మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీ పైరుపై పిచికారి చేయడం వల్ల వినియోగ సామర్థ్యం పెరిగి, నేల ఆరోగ్యం చెడిపోకుండా ఉంటుందన్నారు.

నానో ఎరువుల వినియోగంపై రైతులు దృష్టి పెట్టాలి

దొరవారిసత్రం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులు నానో ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్ అన్నారు. శనివారం దొరవారిసత్రం మండలం నెలబల్లి రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన ఆయన అక్కడే రైతులతో మాట్లాడారు. నానో యూరియా, నానో డీఏపీల గురించి రైతులకు వివరించారు. నానో డీఏపీలో 8శాతం నైట్రోజన్, 16 శాతం ఫాస్పరస్ ఉంటుందని తెలిపారు. చిన్న కణాల కారణంగా నానో డీఏపీ 90 శాతం కంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన పోషకాలను మొక్కలకు అందిస్తుందన్నారు. అలాగే లీటర్ నీటికి 2-4 ఎంఎల్ నానో యూరియా పిచికారి చేసుకుంటే సరిపోతుందన్నారు.

బయో ఫర్టిలైజర్స్‌పై అవగాహన

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం రైతులకు బయో ఫర్టిలైజర్స్, నానో యూరియా, నానో డీఏపీలపై ఏవో శిరీషా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరికీ నానో యూరియా, నానో డీఏపీ, బయో ఫర్టిలైజర్స్ వాడడం వల్ల భూమిలో నత్రజని శాతం పెరిగి అధిక దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో బాలాయపల్లి ఏవో ప్రవీణ, ఏఈవో రామ్మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరాజు సచ్చిదానందం వద్ద చదువుకోవడం నా అదృష్టం: మేడసాని మోహన్



మేడసాని మోహన్‌ను సన్మానిస్తున్న డాక్టర్ భీమన్న తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సింగరాజు సచ్చిదానందం వంటి గురువు వద్ద చదువుకోవడం తన అదృష్టమని అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ తెలుగు విభాగంలో శనివారం సింగరాజు సచ్చిదానందం స్మారకోపన్యాసం చేశారు. సింగరాజు చొరవతోనే తాను అష్టావధానంలో రాణించానని గుర్తు చేసుకున్నారు. విద్యా, సాహిత్య, సామాజిక సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి సింగరాజు సచ్చిదానందం అని కొనియాడారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎన్.భీమన్న మాట్లాడుతూ.. సింగరాజు సచ్చిదానందం జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాలరెడ్డి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎన్.భీమన్న, తేజోవాణి, ప్రసాదరావు, లోకనాథ మండడి, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడాకారులు మరింత మెరుగ్గా రాణించాలి

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కరాటే, బాక్సింగ్‌లో మరింత మెరుగ్గా రాణించి అత్యధిక పతకాలు సాధించాలని శాప్ ఛైర్మన్ రవినాయుడు క్రీడాకారులను ప్రోత్సహించారు. తిరుపతికి చెందిన కరాటే, బాక్సింగ్ క్రీడాకారులు విద్యశ్రీ, విష్ణుప్రియ, జానవి, అభినాథ్, ఆయా అసోసియేషన్ ప్రతినిధులతో శనివారం ఉదయం క్యాంపు కార్యాలయంలో రవినాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో చిల్డ్రన్ అండ్ క్యాడెట్స్ నేషనల్ కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్, హర్యానాలోని కురుక్షేత్ర యూనివర్శిటీలో నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో రాణించి మెడల్స్ కైవసం చేసుకున్నట్లు ఆయన దృష్టికి తెచ్చారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య



సిద్దయ్య మృతదేహం

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తట్టుకోలేక దళితుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు అందించిన వివరాలు... మండలంలోని వీఎస్‌పురం దళితవాడకు చెందిన దేవత సిద్దయ్య(54) శ్రీకాళహస్తి సమీపంలోని కోకా-కోలా కంపెనీలో పని చేస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం సుమారు రూ. 5లక్షల వరకు అప్పు చేశారు. తీర్చే దారి కనబడక శనివారం ఉదయం సమీపంలో పొలాల దగ్గర పురుగు మందు తాగాడు. అటుగా వెళ్తున్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు సిద్దయ్యను శ్రీకాళహస్తిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు.

గుండెపోటుతో ఒకరి మృతి: ఆగిన కుంభాభిషేకం



శ్రీధర్(ఫైల్)

ఏర్పేడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రామాలయం కుంభాభిషేకం హోమంలో కూర్చున్న వ్యక్తి ఉన్నట్టుండి కుప్పకూలి మృతి చెందడంతో కార్యక్రమం ఆగింది. మండలంలోని చింతలపాళెంలో రూ.20లక్షలతో రామ మందిరాన్ని నిర్మించారు. వేద పండితుల సూచనలతో శనివారం ఆలయ కుంభాభిషేకాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆలయంలో జరుగుతున్న హోమంలో కూర్చుని ఉన్న అదే గ్రామానికి చెందిన శ్రీధర్(45) గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో కుంభాభిషేకం నిలిచిపోయింది. శ్రీధర్ తిరుపతి నుంచి తిరుమలకు కారు తోలుకుని జీవనం సాగిస్తుంటాడు. ఇతనికి భార్య, ఇద్దరు చిన్నపిల్లలున్నారు.

రేషన్‌బియ్యం స్వాధీనం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6(ఆం ధ్రజ్యోతి): అక్రమంగా తరలి స్తున్న రేషన్‌బియ్యాన్ని శ్రీకాళహస్తి 1టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని జయరామరావువీధిలో రేషన్‌బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తున్నట్లు స్థానికులు పోలీసు లకు సమాచారం అందించారు. హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆటో సహా బియ్యాన్ని స్టేషన్‌కు తరలించారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముక్కంటీశుడి ఆలయంలో కొలువై ఉన్న శనీశ్వరస్వామికి శనివారాన్ని పురస్కరించుకుని తైలాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం శనీశ్వరస్వామికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ జలం, కలశ జలాలతో అభిషేకించారు. పుష్పాలతో విశేషంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్షణ ట్రస్టుకు తిరుపతికి చెందిన విజయదీపిక రూ.1,11,116 శనివారం విరాళమిచ్చారు. దీనికి సంబంధించిన డీడీని సూపరింటెండెంట్ కోదండపాణికి అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా రాణించాలి

● శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కరాటే, బాక్సింగ్‌లో మరింత మెరుగ్గా రాణించి అత్యధిక పతకాలు సాధించాలని శాప్ ఛైర్మన్ రవినాయుడు క్రీడాకారులను ప్రోత్సహించారు. తిరుపతికి చెందిన కరాటే, బాక్సింగ్ క్రీడాకారులు విద్యశ్రీ, విష్ణుప్రియ, జానవి, అభినాథ్, ఆయా అసోసియేషన్ ప్రతినిధులతో శనివారం ఉదయం క్యాంపు కార్యాలయంలో రవినాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో చిల్డ్రన్ అండ్ క్యాడెట్స్ నేషనల్ కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్, హర్యానాలోని కురుక్షేత్ర యూనివర్శిటీలో నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో రాణించి మెడల్స్ కైవసం చేసుకున్నట్లు ఆయన దృష్టికి తెచ్చారు. కాగా వారు సాధించిన మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిథ్యం వహించి సత్తాచాటాలని ఆయన కోరారు.

తబ్లీ ఇస్తేమా సభ అనుమతులు రద్దు చేయాలి

● ఏపీ సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతీ స్వామి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పవిత్ర తిరుపతి పుణ్యక్షేత్రంలో తబ్లీ ఇస్తేమా సభకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతీ స్వామి డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ నిత్యం గోవింద నామస్మరణలు వినిపించే తిరుపతిలో ఈ నెల 14, 15 తేదీల్లో అన్యమతస్తుల సభలకు ఎలా అనుమతులిస్తారని ప్రశ్నించారు. తబ్లీ జమాతేను ముస్లిం దేశాలే తీవ్రవాద మూలాలున్నాయనే ఆరోపణల నేపథ్యంలో నిషేధించాయని తెలిపారు. ఆ సంస్థ అనుబంధంగా ఉన్న నాలుగింటిలో ఇప్పుడు సభ నిర్వహణకు అనుమతులు తీసుకున్న తబ్లీ ఇస్తేమా కూడా ఒకటని ఆరోపించారు. ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో మరో పది రోజుల్లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో అన్యమతస్తుల సభలకు అనుమతి ఇవ్వడం ఎంతవరకు సమజసమని ప్రశ్నించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించినా స్పందన లేదన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి జమ్మూకాశ్మీర్‌లో ఈ సంస్థ సభ నిర్వహణకు శాంతిభద్రతల కారణంగా అనుమతులివ్వ లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి సభ నిర్వహణకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ సనాతన ధర్మ పరిరక్షణ సభ్యులు కిరణ్‌కుమార్, బాలకృష్ణ, చేతన్‌గాడ్ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో రైతులకు ఆదాయం



తొండమనాడు ఆర్ఎస్కేలో జరిగిన సమావేశం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నానో యూరియాతో రైతులకు సాగు ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందని ఏడీఏ రమేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని తొండమనాడు రైతు సేవా కేంద్రంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ... నానో యూరియా, నానో డీఏపీ, నీటిలో కలిపి పిచికారీ చేసే 19:19:19, 20:20:20 కాంప్లెక్సు ఎరువులు, అధిక సాంద్రత కలిగిన 13-0-45, ద్రవరూప నత్రజని ఎరువులు వంటివి అందుబాటులో ఉన్నాయన్నారు. అధికారుల సూచనల మేరకు కాంప్లెక్సు ఎరువులను దుక్కిలో వేసుకోవాలన్నారు. అలాగే, పైరుపై ఎరువులను పిచికారీ చేసుకుంటే సాగు ఖర్చులు అదుపులో ఉంటాయన్నారు. నానో ఎరువుల వాడకంపై వివరించారు. ఏవో(టీఏ) సూర్యప్రకాష్‌రెడ్డి, ఇఫ్కో సేల్స్ మేనేజరు మణిచంద్ర, రైతు సేవా కేంద్రం సిబ్బంది కిరణ్మయి పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): నానో యూరియా, నానో డీఏపీ, జీవన ఎరువులపై మండలంలోని ఎండీపుత్తూరులో రైతులకు ఏర్పేడు ఏవో సాగరిక ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): నానో యూరియా, డీఏపీ, బయో ఫెర్టిలైజర్లపై వ్యవసాయాధికారి షణ్ముగం, ఏఈవో రేవతి, రైతులకు అవగాహన కల్పించారు.

బేటీ బచావో, బేటీ పఢావోపై అవగాహన

వరదయ్యపాళెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనపురం అంగన్వాడీ కేంద్రంలో సత్యవేడు సీడీపీవో దేవకుమారి ఆధ్వర్యంలో శనివారం బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. మిషన్‌శక్తి ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కిశోర బాలికలు, మహిళలకు లింగ వివక్షత, చట్టాలపై అవగాహన, ఆడ పిల్లల్లో నైపుణ్యాలు పెంపు, ఫోక్సో చట్టం, ఆహారం, ఆరోగ్యం, బాల్యవివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శిల్ప, జ్యోతి, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

భావితరాలకు ఉపాధ్యాయులే మార్గదర్శకులు

శ్రీకాళహస్తి/నారాయణవనం/పిచ్చాటూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేడాం చిన్నమిట్టకండ్రిగలో ఉపాధ్యాయుల దినోత్సవాలను శనివారం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రతి ఒక్కరు గురువులను గౌరవించాలని తెలిపారు. భావి తరాలకు దిశ, దశా చూపించేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. శనివారం నారాయణవనం ఎమ్మార్సీ వేదికగా గురుపూజోత్సవం జరిగింది. ఉపాధ్యాయ వృత్తి మించింది లేదన్నారు. జడ్పీటీసీ సుమన్‌కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలను నిర్దేశించి, సమాజానికి మంచి పౌరులును అందించే గురుతర బాధ్యత ఉపాధ్యాయుల మీద ఉందన్నారు. ఎంఈవోలు కస్తురయ్య, జనార్దనరాజు, మాజీ ఎంఈవో ప్రభాకర్‌రాజు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు. పిచ్చాటూరు స్థానిక ఎంఈవో కార్యాలయంలో శనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా ఉండాలని ఎంఈవో హేమమాలి సూచించారు. ఉపాధ్యాయుడు అచ్చు లాంటి వారని, మంచి విద్యార్థులను తయారు చేయాలని ఎంఈవో-2 యుగంధర్‌రాజు తెలిపారు.

పేదల సేవే పరమాత్ముడి సేవ


ప్రభుత్వాస్పత్రికి స్ట్రెచర్ అందజేస్తున్న బాలుయాదవ్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పేదల సేవే పరమాత్ముడి సేవ అని పట్టణానికి చెందిన విజయ స్టీల్స్ అండ్ సిమెంట్ ఏజెన్సీస్ అధినేత బాలుయాదవ్ అన్నారు. ఇటీవల ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ఎన్నికైన జనసేన నాయకుడు కుమార్ అభ్యర్థన మేరకు బాలుయాదవ్ రూ.10వేల విలువైన ఆస్పత్రికి స్ట్రెచర్‌ను వితరణ చేశారు. ఈ మేరకు శనివారం ఆస్పత్రి సూపరిం టెండెంట్ మణికి అందజేశారు. ఆర్ఎంవో విజయలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్ రత్నకుమారి, హెడ్ నర్సు విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్‌డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మల్లికార్జుననాయుడు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం విద్యాసంస్థల్లో శనివారం గ్రాండ్ పేరెంట్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఎంజీఎం సంస్థల చైర్మన్ గుడ్లూరు మల్లికార్జుననాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు వారి మనవళ్లు, మనవరాళ్లకు తమ చేతుల మీదు భోజనం తినిపించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రాండ్ పేరెంట్స్‌కు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పిల్లల చేత వారికి పాదపూజ చేయించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గుడ్లూరు మయూర్, ప్రిన్సిపాల్ వి.ఎస్.రత్నం, ప్రధానోపాధ్యాయుడు మునిరత్నంనాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్లం అన్నదాన హుండీ ఆదాయం లెక్కింపు

ఏర్పేడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన హుండీని శనివారం సాయంత్రం ఈవో రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.30,098 వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ మొత్తంతో ప్రతిరోజు భక్తులకు అన్నదానం చేస్తామన్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవం




యాగశాల వద్ద పూజలు - భరద్వాజ మహర్షి, శ్రీ- కాళ-హస్తిలకు అర్చనలు - పూజాద్రవ్యాలతో అర్చకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6(సెప్టెంబరు): శ్రీకాళహస్తీశ్వరాలయంలో పవిత్రోత్సవాలు నాల్గో రోజు శనివారం ఆగమోక్తంగా జరిగాయి. నిత్య పూజల్లో జరిగే దోషాలను నివారించేందుకు యేటా ఈ పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆలయంలోని యాగశాల వద్ద శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షి ఉత్సవమూ ర్తులకు పలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం అన్ని అభిషేకాలను రద్దు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనం రాత్రి 9 గంటల వరకు ఉంటుందని ఈవో బాపిరెడ్డి తెలిపారు.

ట్రంప్ పట్ల మోదీ మెతక వైఖరి వీడాలి: వామపక్షాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ట్రంప్ పట్ల ప్రధానమంత్రి మోదీ మెతక వైఖరి వీడనాడాలని సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి అన్నారు. స్థానిక పెండ్లిమండపం వద్ద శనివారం వామపక్షాల ఆధ్వర్యంలో భారత్‌పై ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ట్రంప్ భారత్‌పై విధించిన 50శాతం సుంకాల వల్ల టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ ఉత్పత్తులు ఘోరంగా పడిపో యాయన్నారు. దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40శాతం ఎగుమతులు ఆంధ్రప్రదేశ్ నుంచే అవుతున్నాయని, రొయ్యల ధరలు పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. సీపీఐ నేతలు కత్తి రవి, మల్లికార్జున్, సీపీఎం నాయకులు వేణు, కుమార్, రాపూరు సుబ్రహ్మణ్యం, గురునాథం, అన్వర్‌బాషా, కమలమ్మ పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): భారతదేశంపై 50 శాతం సుంకాలు విధిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై ప్రధాని మోదీ మెతక వైఖరి వీడి, తక్షణమే సుంకాలు రద్దు చేసేలా చర్యలు చేపట్టాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్దన్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్, రమేష్, అరుణాచలం, మురళి, మునస్వామి, కృష్ణయ్య, కొల్లాపురి, లక్ష్మీ, సుశీలమ్మ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): భారతదేశం నుంచి ఎగుమతి అవుతున్న వస్తువులు, సరుకులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 50శాతం సుంకాలు విధించడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం శనివారం చేపట్టారు. సీపీఎం నాయకుడు రంగయ్య మాట్లాడుతూ .. సుంకాల పోరులో ఆక్వారంగం త్రీంగా నష్టపోయిందన్నారు. అలాగే టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ రంగాలదీ అదే పరిస్థితి అన్నారు. వెంకటాద్రి, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు మురళీధర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ చెప్పారు. మండలంలోని కనమనంబేడులోని ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో డెంగ్యూ, చికున్ గున్యా, మెదడువాపు వ్యాధి, విరేచనాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ ధర్మేందర్ సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీని అభివృద్ధి చేస్తా

నారాయణవనం, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీని జడ్పీ నిదులతో అభివృద్ధి చేస్తానని జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీ నిధుల వినియోగంపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలలో ప్రజా అవసరాలను గుర్తించి, నిధులను పారదర్శకంగా వినియోగించాలని అధికారులను కోరారు. మాజీ ఎంపీపీ గోవిందస్వామి, ఎంపీడీవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సబ్‌స్టేషన్ పనులను పూర్తి చేయండి


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడియూరు సబ్‌స్టేషన్‌కు టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదిమూలం విద్యుత్‌శాఖ డీఈ, ఏడీలకు సూచించారు. శనివారం ఉదయం పిచ్చాటూరు టీచర్స్ కాలనీలో 3 ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. సత్యవేడు మండలం చమర్తి కండ్రిగ సబ్‌స్టేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నీరువాయి పాత హరిజనవాడలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఏఈ సుబ్రహ్మణ్యంను కోరారు. ఏడీ రమేష్, డీఈ ఆశీర్వాదం, ఎస్ఐ వెంకటేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, టీడీపీ నాయకులు పద్దురాజు, సుమాంజలి, నాగూర్, ఏసు, డిల్లీబాబు, వెంకటరత్నం నాయుడు, ఎస్ఎం సురేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులను రికవరీ చేయండి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం ఎస్ఎస్‌పురం పంచాయతీలో నిధులు దుర్వినియోగం చేసిన కార్యదర్శిపై చర్యలు తీసుకుని రికవరీ చేయాలని సర్పంచ్ కుమారుడు లీలాకృష్ణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ తమ పంచాయతీ ఇంచార్జి కార్యదర్శిగా పనిచేసిన పరంధామ సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులకు తెలియకుండానే 15వ ఆర్థిక సంఘం నిధి రూ.2,15,980, సాధారణ నిధి రూ.70వేలను ఓటీపీల ద్వారా డ్రా చేసుకున్నారని చెప్పారు. ఆ నిధులతో చిన్నపని కూడా చేయకుండా దుర్వినియోగం చేశారని చెప్పారు. అలాగే ప్రస్తుతం ఇంచార్జిగా వ్యవహరిస్తున్న మరో ఆరు పంచాయతీల్లో కూడా నిధులను దుర్వినియోగం చేశారన్నారు. సర్పంచులంతా ఎంపీడీవో బాలాజీ నాయక్‌కు ఫిర్యాదు చేసినా ఆయన ఆ కార్యదర్శికి మద్దతుగా నిలుస్తూ తమనే బెదిరిస్తున్నారని చెప్పారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మురుగునీటి కాలువ నిర్మాణానికి భూమి పూజ



ఏర్పేడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటే ప్రతి గ్రామంలో మురుగుకాలువలు ఉండాలని ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు అన్నారు. ఏర్పేడులో మురుగుకాలువల నిర్మాణానికి శనివారం ఆయన నియోజకవర్గ తెలుగుమహిళ నేత గాలి కృష్ణవేణితో కలిసి భూమిపూజ చేశారు. గ్రామీణ ప్రాంతాలు శుభ్రంగా ఉండాలనే సీఎం చంద్రబాబు పంచాయతీలకు ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నారని చెప్పారు. వాటితో అన్ని గ్రామాల్లో మురుగు నీటి కాలువలు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజి, కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కొలతలు సరిగ్గా తీయండి

కేవీబీపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు నాణ్యంగా ఉండాలని, చేసిన పనికి కొలతలు సరిగా లేకపోతే బిల్లులు రావని ఏపీవో భాస్కరరావు, ఏఈ భాస్కరయ్య చెప్పారు. కూలీలు ప్రతి పనిని క్షేత్రసహాయకుడు ఇచ్చే కొలతల ప్రకారమే చేయాలన్నారు. తవ్వకాలు సరిగా లేక పోయినా, టెక్నికల్ సిబ్బంది తీసిన కొలతలకు సరిపోకపోయినా బిల్లులు రావని చెప్పారు.

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ



నారాయణవనం, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి ఊంజలసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లను ప్రత్యేకంగా అలంకరించి ఉయ్యాలపై అధిష్ఠింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, ఆలయ అధికారి నాగరాజు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అధికార నందిపై పరాశరేశ్వరుడి విహారం



నారాయణవనం, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): నారాయణ వనంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న చంపకవల్లి సమేత పరాశరేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు అధికార నందిపై ఊరేగారు. ఆదివారం ఉదయం నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం పట్టు పవిత్రాల సమర్పణ నిర్వహించారు. అనంతరం చంపకవల్లి సమేత పరాశరేశ్వర స్వామి అధికార నంది వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలతో హారుతులిచ్చారు. ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వినాయక నిమజ్జనం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బైబై గణేశా అంటూ భక్తులు ఘనంగా స్వామివారికి వీడ్కోలు పలికారు. చవితి ఉత్సవాల్లో భాగంగా వినాయక ప్రతిమలను వాడవాడలా మండపాల్లో ప్రతిష్ఠించిన విషయం తెలిసిందే. 3, 5, 9వ రోజుల్లో అత్యధిక సంఖ్యలో వినాయక నిమజ్జనాలు జరిగాయి. చివరిగా 11వ రోజున శనివారం తుది నిమజ్జనాన్ని నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం 2వ గేటు సమీపంలో ఏర్పాటు చేసిన బాల గణపతి ప్రతిమకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణంలో ఊరేగించి నిమజ్జనం చేశారు. అలాగే పానగల్, శ్రీరాంనగర్ కాలనీలో పలు వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు.